విశాఖపట్టణం
సోమవారం 7 సెప్టెంబర్ 2026

For a pure tomorrow..

# జయ జయహే

epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక: 206 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool



## మెట్రోలో మోడీ..!

జెన్ జీ విద్యార్థులతో ముచ్చట్లు

2

# నేపాల్‌లో కొనసాగుతున్న సహాయక చర్యలు

11 రోజులు గడిచినా శిథిలాల కింద మృతదేహాలు

20 హెలికాప్టర్లతో కొనసాగుతున్న వేట

ఇప్పటివరకు 1,344 మంది మృతి

మరో 5 వేల మంది కోసం గాలింపు





(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

నేపాల్‌ను అతలాకుతలం చేసిన ఆకస్మిక వరదలు, కొండచరియల విరిగిపడటంతో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. విపత్తు సంభవించి 11 రోజులు గడిచినా, శిథిలాల కింద చిక్కుకున్న వారిని సజీవంగా బయటకు తీసేందుకు భద్రతా బలగాలు, అంతర్జాతీయ రెస్క్యూ బృందాలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. ఈ క్రమంలో శనివారం ఇద్దరిని సజీవంగా రక్షించడం ఆశలు రేకెత్తించింది. ఒక విదేశీయుడిని అపర్ త్రిశూలీ-1 జలవిద్యుత్ ప్రాజెక్టు సొరంగం నుంచి బయటకు తీసుకురాగా, మరో మహిళను నువాకోట్ జిల్లా బిదూర్‌లో కాపాడారు. మరోవైపు వరదల్లో ఇప్పటివరకూ మృతి చెందిన వారి సంఖ్య 1,344కు చేరింది. భోటేకోశీ వరదల ప్రభావంతో తీవ్రంగా దెబ్బతిన్న అపర్ త్రిశూలీ-1 ప్రాజెక్టు సొరంగంలో చిక్కుకున్న ఓ విదేశీయుడిని నేపాల్ సైన్యం సజీవంగా బయటకు తీసింది. రెస్క్యూ అనంతరం అతడిని హెలికాప్టర్ వద్దకు తరలించి వైద్య సిబ్బంది ప్రాథమిక పరీక్షలు నిర్వహించారు. అతడి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. ఇదే సమయంలో ..మిగతా 2లో



## లీడర్‌షిప్ ట్రైనింగ్ కాంక్లేవ్

రాజకీయాల్లో టీడీపీ కొత్త ఒరవడి

7,8 తేదీల్లో శ్రేణులకు శిక్షణ

రెండు రోజుల్లో పది సెషన్లు

హాజరుకానున్న చంద్రబాబు, లోకేశ్

(అమరావతి - జయజయహే)

రాజకీయాల్లో కొత్త నాయకత్వ విధానానికి తెలుగుదేశం పార్టీ శ్రీకారం చుడుతోంది. ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ స్థాయి ముఖ్య ప్రతినిధులకు నాయకత్వ పటిమ పెంపొందించే అంశంపై రెండు రోజుల ట్రైనింగ్ కాంక్లేవ్‌ను టీడీపీ నిర్వహిస్తోంది. ఈ నెల 7, 8వ తేదీల్లో మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో రెండు రోజుల పాటు లీడర్‌షిప్ ట్రైనింగ్ కాంక్లేవ్‌ను నిర్వహించనుంది. రెండు రోజుల్లో 10 సెషన్లల్లో ఈ కాంక్లేవ్ జరగనుంది. ట్రైనింగ్ - ఇంటరాక్టివ్ విధానంలో లీడర్‌షిప్ కాంక్లేవ్ నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. క్షేత్రస్థాయిలో టీడీపీ నాయకత్వాన్ని మరింత బలోపేతం చేసేలా కాంక్లేవ్ నిర్వహించేలా మంత్రి, టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ ప్రణాళికలు రచించారు. ఈ కాంక్లేవ్‌కు చంద్రబాబు, లోకేశ్ హాజరు కానున్నారు. క్షేత్రస్థాయి ..మిగతా 2లో

# విశాఖ జడ్పీ మూడు ముక్కలు

విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాగా విభజన... ఉద్యోగుల కేటాయింపు ప్రక్రియ పూర్తి

(విశాఖపట్నం - జయజయహే)

సుదీర్ఘ చరిత్ర కలిగిన ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ ఇక నుంచి మూడు జిల్లాల పరిధిలో సేవలు అందిచనుంది. ఈ మేరకు ప్రభుత్వం శనివారం జీవో నంబర్ 114ను విడుదల చేసింది. ఏయే మండలాలు ఏయే జిల్లాల పరిధిలోకి వెళ్తాయనే విషయాన్ని స్పష్టంగా ఇందులో తెలిపింది. ఆంధ్రప్రదేశ్‌లో 28 జిల్లాలకు వేర్వేరుగా జిల్లా పరిషత్‌లను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న 13 జడ్పీలకు 13 మంది సీఈవోలు ఉన్నారు. కొత్తగా వచ్చిన మరో 15 జడ్పీలకు సీఈవో, డిప్యూటీ సీఈవో పోస్టులను సృష్టించారు. ఇక నుంచి ఉమ్మడి విశాఖ జిల్లాలో విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాలకు వేర్వేరుగా సీఈవోలు, డిప్యూటీ సీఈవోలు ఉండనున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా 2022లో ..మిగతా 2లో





## కేంద్ర బలగాలను మోహరించాలి

స్థానిక ఎన్నికలకు భద్రత కల్పించాలి

స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలు జరపాలి

ఎస్ ఈసీకి వైఎస్సార్ సీపీ లేఖ

2



## ఉద్యోగం చేస్తాం.. ఊడిగం చేయం!

సచివాలయ ఉద్యోగుల ఆందోళన

ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్ దిగ్బంధం

బాటిళ్ల శబ్దాలతో హోరెత్తిన నగరం

(విశాఖపట్నం - జయజయహే)

తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు చేపట్టిన ఆందోళన మరింత ఉధృతమైంది. గత మూడు రోజులుగా జీవీఎంసీ ప్రధాన కార్యాలయం ఎదుట గాంధీ విగ్రహం వద్ద కొనసాగుతున్న నిరసనకు ముగింపు రోజైన ఆదివారం ఉద్యోగులు రోడ్డుపై బైఠాయించి తమ నిరసనను తీవ్రతరం చేశారు. జోన్--1 పరిధిలోని ఉత్తరాంధ్ర ఆరు జిల్లాలకు చెందిన గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో ఆందోళనలో పాల్గొన్నారు. తమ ..మిగతా 2లో

## థాంక్యూ సీఎం..సార్

ఉద్యోగుల కోర్కెలను నెరవేర్చారు

చర్చల ద్వారానే సమస్యలు పరిష్కారం

స్పందించకుంటేనే ఉద్యమబాట... ఉద్యోగులు జేఏసీ నేతలు ప్రకటన




(అమరావతి - జయజయహే)

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించడం పట్ల జేఏసీ ఛైర్మన్ విద్యాసాగర్ హర్షం వ్యక్తం చేశారు. పీఆర్సీ, డీఏలు, సరెండర్ లీవులు, హెల్త్ కార్డులు, పెన్షనర్ల అదనపు క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ తదితర అంశాలపై సీఎంతో జరిగిన చర్చల్లో పలు హామీలు లభించాయని చెప్పుకొచ్చారాయన. పీఆర్సీ కమిషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చారని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న మొత్తం 5 డీఏల్లో రెండింటిని ఒకే నెలలో చెల్లిస్తామని, సరెండర్ లీవ్‌లకు సంబంధించి ఒక విడత చెల్లింపు చేస్తామని చెప్పారన్నారు. పోలీస్ ఉద్యోగులకూ సెప్టెంబర్ నుంచి అదనంగా మరో సరెండర్ లీవ్ ప్రకటించినట్లు వివరించారు. అంతేకాకుండా.. ఉద్యోగుల ఆరోగ్య కార్డుల సమస్యను కూడా సీఎం దృష్టికి తీసుకెళ్లినట్టు విద్యాసాగర్ తెలిపారు. అయితే.. ..మిగతా 2లో

## 2029 నాటికి డ్రగ్స్ రహిత భారతదేశమే లక్ష్యం

డ్రగ్స్ రహిత భారత్‌తోనే 'వికసిత్ భారత్' కల సాకారం: అమిత్ షా

6



For a pure tomorrow.. జయహో

# నేపాల్‌లో కొనసాగుతున్న సహాయక చర్యలు

**మొదటి పేజీ తరువాయి...**

నువాకోట్ పట్టణంలో.., ధ్వంసమైన ఒక ఇంటి నుంచి చండికా శ్రేష్ఠ అనే 64ఏళ్ల వృద్ధురాలిని సహాయ సిబ్బంది ప్రాణాలతో బయటకు తీశారు. మెరుగైన వైద్యం కోసం ఆమెను హెలికాప్టర్‌లో కాఠ్‌మాండ్ తరలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. అత్యంత దయనీయ స్థితిలో ఉన్న వృద్ధురాలిని దుప్పటిలో చుట్టి ఇంటి నుంచి బయటకు మోసుకెళ్తున్న దృశ్యాలను నేపాల్ సైన్యం సామాజిక మాధ్యమాల్లో పంచుకుంది. ఇప్పటికే శుక్రవారం త్రిశూలీ-3ఏ జలవిద్యుత్ ప్రాజెక్టు సొరంగం నుంచి ఇద్దరు నేపాలీలను సజీవంగా బయటకు వచ్చారు.



వరదల్లో కొట్టుకుపోయిన మృతదేహాలు ఎక్కువగా నీటిలో ఎక్కువకాలం ఉండటం, బురద, శిథిలాల కింద చిక్కుకోవడంతో తీవ్రంగా దెబ్బతిన్నాయి. కొన్ని మృతదేహాలు పూర్తిగా లభించకపోవడంతో మృతుల గుర్తింపు అధికారులకు పెద్ద సవాలుగా మారింది. ఇప్పటివరకు అవసరమైన ప్రక్రియలు, డీఎన్‌ఏ నమూనాల సేకరణ పూర్తయ్యాక 1,030 మృతదేహాలను తాత్కాలికంగా ఖననం చేశారు. అయితే గుర్తింపు పూర్తైన 96 మృతదేహాలను మాత్రమే కుటుంబాలకు అప్పగించారు. మృతుల గుర్తింపులో డీఎన్‌ఏ పరీక్షలు కీలకంగా మారాయి. ఇందుకోసం మృతదేహాల నుంచి సేకరించిన నమూనాలను కుటుంబ సభ్యుల జీవ నమూనాలతో సరిపోల్చాల్సి ఉంటుంది. నువాకోట్‌లోని తాత్కాలిక ఫీల్డ్ ఆసుపత్రిలో డీఎన్‌ఏ నమూనాల సేకరణ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేశారు.

నేపాల్ సైన్యం సుమారు 20 హెలికాప్టర్లను సహాయక చర్యలకు వినియోగిస్తోంది. నువాకోట్, రసువా జిల్లాల్లో గాలింపు, రక్షణ, సహాయక సామగ్రి పంపిణీ నిరంతరం కొనసాగుతోంది. ప్రతికూల వాతావరణం, ప్రమాదకరమైన పర్వత ప్రాంతాలు, వరదలకు దెబ్బతిన్న హెలిప్యాడ్‌ల కొరత ఉన్నప్పటికీ హెలికాప్టర్లు సహాయక చర్యలు నిర్వహిస్తున్నాయి. నువాకోట్‌లో ఉప్పొంగిన టాడీ నదిపై తాత్కాలిక తాడు వంతెన నిర్మించేందుకు సైనిక ఇంజినీరింగ్ బృందాలు పనిచేస్తున్నాయి. రహదారి సంబంధాలు తెగిపోయిన ప్రాంతాలకు భూసంబంధిత రవాణాను పునరుద్ధరించడమే లక్ష్యంగా ఈ పనులు సాగుతున్నాయి. ఈ విపత్తులో ఇప్పటివరకు 1,344 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో దాదాపు 5 వేల మంది ఆచూకీ కోసం గాలింపు కొనసాగుతోంది. గల్లంతైన వారిలో కనీసం 589 మంది విదేశీయులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటివరకు 13 వేల మందికి పైగా ప్రజలను రక్షించారు. నేపాల్‌లోని ఎనిమిది జిల్లాల్లో మృతదేహాలు లభ్యమయ్యాయి. చిత్వాన్‌లో అత్యధికంగా 360 మృతదేహాలు లభించగా, పశ్చిమ నావల్‌పరాసీలో 230, తూర్పు నావల్‌పరాసీలో 222 మృతదేహాలు వెలికితీశారు. మిగిలినవి నువాకోట్, రసువా, గోర్ఖా, ధాదింగ్, తనహున్ జిల్లాల్లో లభించాయి.



# మెట్రోలో మోడీ..!

### జెన్ జీ విద్యార్థులతో ముచ్చట్లు

**(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)**

భారత ప్రధాని నరేంద్ర మోదీ శనివారం ఢిల్లీ యూనివర్సిటీలో జరిగిన శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ శతాబ్ది ఉత్సవాల కోసం ఢిల్లీ మెట్రోలో ప్రయాణించారు. ప్రధాని మోదీ కాన్వాయ్‌లో కాకుండా మెట్రో రైలులోనే కాలేజ్‌కు వెళ్లి వచ్చారు. మెట్రో ప్రయాణం సందర్భంగా చిన్న పిల్లలు, మహిళలతో ఆయన ముచ్చటించారు. ప్రధాని మోదీ తన ప్రయాణానికి సంబంధించిన ఫొటోలు, వీడియోను మెట్రో మూమెంట్స్ శీర్షికతో ఆదివారం ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ శతాబ్ది ఉత్సవాలలో పాల్గొన్న ప్రధాని మోదీ కళాశాలకు చెందిన జెన్ జీ విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. యువత తమ ఆలోచనలు, ఆకాంక్షలు, భవిష్యత్ లక్ష్యాలను దేశ ప్రధానితో నేరుగా పంచుకునేందుకు ఈ కార్యక్రమం ఒక వేదికగా నిలిచింది.





### నేడు అమ్మవారి ఆలయ

# విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

**మునగపాక సెప్టెంబర్ 6 (జయ జయహే)**

టి సిరసపల్లిలో మరిడిమాంబ అమ్మవారి నూతన ఆలయ విగ్రహ ప్రతిష్ట మహోత్సవం పునః నిర్మించిన మరిడిమాంబ ఆలయ ప్రారంభోత్సవం నూతన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం సోమవారం ఉదయం 10 గంటల 21 నిమిషాలు జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు బంటుపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమం జరుగుతాయని మధ్యాహ్నం భా భారీ అన్న సమారాధన జరుగుతుందని ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు తెలిపారు టి సిరసపల్లి ఎగువ దిగువ గ్రామాల ప్రజల సహకారంతో ఈ నూతనలయాన్ని నిర్మించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు పూజ కార్యక్రమాల్లోనూ అన్న సమారాధన కార్యక్రమాలలోనూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు సేకరించాలని ఆయన కమిటీ సభ్యులు కోరుతున్నారు

# విశాఖ జడ్పీ మూడు ముక్కలు

**మొదటి పేజీ తరువాయి...**

మూడుగా వీడినప్పటికీ జిల్లా పరిషత్ మాత్రం వేరు కాలేదు. జడ్పీ పాలక వర్గం గడువు ఈ నెల 27 వరకు ఉంది. ఇంతకాలం ఉమ్మడి జిల్లాగానే జడ్పీ కార్యక్రమాలు కొనసాగాయి. ఈ నేపథ్యంలో జిల్లా పరిషత్‌లను పునర్విభజిస్తూ ఉత్తర్వులు వెలువడడంతో ఇక నుంచి మూడు జిల్లాలుగా కొనసాగనున్నాయి.

ఉమ్మడి విశాఖ జడ్పీలో ప్రస్తుతం 900 మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిలో 450 మంది మినిస్టీరియల్ ఉద్యోగులు, 350 మంది నాలుగో తరగతి సిబ్బంది, 100 మంది అధికారులు ఉన్నారు. ఈ మొత్తం ఉద్యోగుల్లో అత్యధికంగా 60 శాతం మందిని అనకాపల్లి జిల్లాకు కేటాయించనున్నారు. మరో 30 శాతం మందిని అల్లూరి జిల్లాకు, మిగిలిన 10 శాతం మంది ఉద్యోగులను విశాఖ జిల్లాకు కేటాయించనున్నారు. కొత్త జిల్లాల ప్రాతిపదికననే త్వరలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు జరగనున్నాయి.

**ఏ జిల్లాలో ఏ మండలం..?**

విశాఖపట్నం జిల్లా పరిధిలోకి భీమునిపట్నం, ఆనందపురం, పద్మనాభం, పెందుర్తి మండలాలు వస్తాయి. అల్లూరి జిల్లా పరిధిలోకి అనంతగిరి, అరకువ్యాలీ, చింతపల్లి, డుంబ్రిగుడ, జి.మాడుగుల, జీకే వీధి, హుకుంపేట, కొయ్యూరు, పాడేరు, ముంచింగ్‌పుట్, పెదబయలు మండలాలు వెళ్లనున్నాయి. అనకాపల్లి జిల్లా పరిధిలోకి అచ్యుతాపురం, అనకాపల్లి, బుచ్చయ్యపేట, చీడికాడ, చోడవరం, దేవరాపల్లి, గొలుగొండ, కె.కోటపాడు, కశింకోట, కోటవురట్ల, మాడుగుల, మాకవరపాలెం, మునగపాక, నక్కపల్లి, నర్సీపట్నం, నాతవరం, పరవాడ, పాయకరావుపేట, రాంబిల్లి, రావికమతం, రోలుగుంట, ఎస్.రాయవరం, సబ్బవరం, ఎలమంచిలి మండలాలు రానున్నాయి.



# ఉత్సవ కమిటీ చైర్మన్‌గా పొలమరశెట్టి

**మునగపాక సెప్టెంబర్ 6 (జయ జయహే)**

మునగపాక, మండలంలోని తోటాడ శివారు గవర్ల అనకాపల్లి గ్రామంలో ఆదివారం నూతన గ్రామ ఉత్సవ కమిటీని ఎన్నుకున్నారు ఈ కమిటీ చైర్మన్ గా పోలమరశెట్టి నరేంద్ర కుమార్ ఎన్నికయ్యారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దొడ్డి కోటేశ్వరరావు మాజీ ఎంపీటీసీ దాడి శ్రీనివాసరావు పొలమరశెట్టి ఆనందరావు రాపిటి పరమేష్ బొడ్డేడశ్రీను తదితరులు పాల్గొన్నారు



# ఎమ్మెల్యే సుందరపు సమక్షంలో జనసేనలో చేరికలు

**మునగపాక సెప్టెంబర్ 6 జయ జయహే,**

ఎలమంచిలి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని మునగపాక మండలంలోని తోటాడ పంచాయతీలో అనిత ఆధ్వర్యంలో సుమారు 15 కుటుంబాలు వైసీపీని వీడి జనసేనలో చేరారు వీరికి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ జనసేన కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు వచ్చే స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించేందుకు కృషి చేయాలని సూచించారు ఈ కార్యక్రమంలో మునగపాక మండల జనసేన అధ్యక్షుడు టెక్కలి పరశురాం ఆడారి ప్రసాదు ఆళ్ల వెంకటేశ్వర్లు పలువురు జనసేన నాయకులు పాల్గొన్నారు

# కేంద్ర బలగాలను మోహరించాలి

### స్థానిక ఎన్నికలకు భద్రత కల్పించాలి

### స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలు జరపాలి

### ఎస్ ఈసీకి వైఎస్సార్ సీపీ లేఖ

**(తాడేపల్లి - జయజయహే)**

స్థానిక ఎన్నికల్లో కేంద్ర బలగాలను మోహరించాలంటూ రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లేఖ రాసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో భద్రత కోసం కేంద్ర బలగాలను మోహరించాలని వైసీపీ నేత లేళ్ల అప్పిరెడ్డి ఎస్ఈసీకి లేఖ రాశారు. స్థానిక ఎన్నికల్లో అధికార దుర్వినియోగం, బెదిరింపులు వంటివి లేకుండా స్వేచ్ఛగా, నిష్పక్షిపాతంగా ఎన్నికలు జరిపేందుకు కేంద్ర బలగాలను మోహరించాల్సిన అవసరం ఉందని కోరారు. వైఎస్సార్ కడప జిల్లా ఒంటిమిట్టలో జరిగిన జెడ్పీటీసీ ఎన్నికల సందర్భంగా అధికార పార్టీ వ్యక్తులు పోలింగ్ ప్రక్రియలో జోక్యం చేసుకున్నారని వైసీపీ ఆరోపించింది. అనుమతి లేకుండానే పోలింగ్ కేంద్రాల్లోకి ప్రవేశించారని.. పోలింగ్ కేంద్రంలోని ఏజెంట్లు, ఓటర్లను బెదిరించారని వైసీపీ నేత లేళ్ల అప్పిరెడ్డి లేఖలో ప్రస్తావించారు. అధికార యంత్రాంగాన్ని దుర్వినియోగం చేయడం సహా పోలింగ్ ప్రక్రియకు ఇబ్బందులు కలిగించారని లేఖలో పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లోనూ ఇలాంటి దారుణాలకు పాల్పడ్డారన్న లేళ్ల అప్పిరెడ్డి.. పిడుగురాళ్ల, పాలకొండ, తుని మున్సిపాలిటీలలో ఇలాంటి అరాచకాలే పాల్పడ్డారని అప్పిరెడ్డి లేఖలో ఆరోపించారు. ఈసారి స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజకీయ పోటీ తీవ్రంగా ఉంటుందని.. ఈ నేపథ్యంలో బెదిరింపులు, నామినేషన్ల దాఖలు సమయంలో అడ్డంకులు సృష్టించే అవకాశాలు ఉన్నాయని వైసీపీ లేఖలో పేర్కొంది. ఈ విషయాలను దృష్టిలో పెట్టుకుని నామినేషన్ల దగ్గర నుంచి ఎన్నికల సామాగ్రి రవాణా, పోలింగ్, స్ట్రాంగ్ రూముల భద్రత వరకూ ఇలా అన్ని దశలలోనూ కేంద్ర బలగాలను మోహరించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌ను లేఖలో కోరారు. సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించాలని.. కేంద్ర బలగాల సాయంతో భద్రతా చర్యలు చేపట్టాలని లేఖలో విజ్ఞప్తి చేశారు. మరోవైపు త్వరలోనే రాష్ట్రంలో స్థానిక ఎన్నికలు నిర్వహించాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు అనుగుణంగా ఇప్పటికే చర్యలు ప్రారంభమయ్యాయి. బీసీ రిజర్వేషన్ల ఖరారుతో పాటుగా మున్సిపల్ ఎన్నికల నిబంధనలు కూడా వెల్లడించారు.

# లీడర్‌షిప్ ట్రైనింగ్ కాంక్లేవ్

**మొదటి పేజీ తరువాయి...**

యంత్రాంగం, కేడర్ సమన్వయం, పొలిటికల్ రెస్పాన్స్, లీడర్‌షిప్ క్వాలిటీస్ వంటి అంశాల్లో నేతల సామర్థ్యాలను మెరుగుపరిచేలా రెండు రోజుల ట్రైనింగ్ కాంక్లేవ్ నిర్వహించనున్నారు. ప్రభుత్వం – ప్రజలకు వారధిగా పార్టీ నేతలు ఉండాలని చంద్రబాబు దిశానిర్దేశం చేయనున్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలు, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం వంటి అంశాలపై కాంక్లేవ్‌లో చంద్రబాబు అవగాహన కల్పించనున్నారు. ప్రభుత్వం – టీడీపీ చేసిన పనులను ప్రజల్లోకి తీసుకెళ్లడం... ప్రత్యర్థి పార్టీల కుట్రలను ఎండగట్టడం వంటి అంశాలపై కాంక్లేవ్‌లో కీలక చర్చించనున్నారు. ఈ సమావేశానికి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో సహా ముఖ్య నేతలు హాజరు కానున్నారు. మొదటి రోజున నాయకత్వ అభివృద్ధి, నాయకులను తీర్చిదిద్దడం, సరైన స్థానంలో నిలబెట్టడం – పార్టీ సంస్థాగత నిర్మాణం, అజెండా, పనితీరు, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం – స్వర్ణాంధ్ర విజన్ – రాజకీయ, ఆర్థిక సాధికారత – సంపూర్ణ సంక్షేమం, సాధికారత అంశాలపై మార్గనిర్దేశం చేయనున్నారు. రెండో రోజున సుస్థిర అభివృద్ధి, ప్రజా సేవలు, సుపరిపాలన, పొలిటికల్ కమ్యూనికేషన్ – ప్రజలకు సేవల చేరువ, ఎల్‌నినోపై అవగాహన, స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధత అంశాలపై టీడీపీ అగ్రనేతలు దిశానిర్దేశం చేయనున్నారు.

### ఉద్యోగం చేస్తాం..

# ఊడిగం చేయం!

**మొదటి పేజీ తరువాయి...**

న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఆందోళనలో భాగంగా ఉద్యోగులు విశాఖ ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రధాన కూడలి వద్దకు చేరుకుని రోడ్డుపై బైఠాయించడంతో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఉద్యోగుల నినాదాలు, బాటిళ్ల శబ్దాలతో నగరం నడిబొడ్డు హోరెత్తింది. "ఉద్యోగం చేస్తాం.. ఊడిగం చేయం" అంటూ ఉద్యోగులు నినాదాలు చేస్తూ తమ సమస్యలపై ప్రభుత్వ దృష్టిని ఆకర్షించే ప్రయత్నం చేశారు. ఆందోళన నేపథ్యంలో పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఉద్యోగులు, పోలీసుల మధ్య తోపులాట చోటుచేసుకున్నట్లు తాజా వార్తా కథనాలు వెల్లడించాయి. ఉత్తరాంధ్రలోని విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన ఉద్యోగులు ఈ ఉద్యమంలో పాల్గొంటున్నారు. తమ సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, పెండింగ్ డిమాండ్లను పరిష్కరించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు స్పష్టం చేశారు.

# థాంక్యూ సీఎం..సార్

**మొదటి పేజీ తరువాయి...**

ప్రభుత్వం నుంచి హెల్త్ ట్రస్టుకు నెలకు రూ.36 కోట్ల మేర నిధులు జమకాకపోవడంతో ఆస్పత్రులకు బిల్లులు చెల్లించడంలో జాప్యం జరుగుతోందని, నగదు రహిత వైద్య సేవలకు ఆస్పత్రులు ముందుకు రావడంలేదని వివరించారు. వచ్చే నెల నుంచి ట్రస్టుకు నిధులు విడుదల చేస్తే మరో 3 నెలల్లో సమస్యను పరిష్కరించవచ్చని తాను చెప్పగా.. నిధులు బదిలీ చేసేందుకు అధికారులకు సీఎం ఆదేశించారని తెలిపారు. రాష్ట్రంలో సుమారు 4 లక్షల మంది పెన్షనర్లకు అదనపు క్వాంటమ్ ఆఫ్ పెన్షన్‌ను 10 శాతానికి పెంచాలని కోరగా.. జనవరి 1 నుంచి అమలు చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. ఇంటీరియమ్ రిలీఫ్‌పై కూడా ఆయన సానుకూలంగా స్పందించి, షెడ్యూల్ రూపొందించి అమలు చేస్తామని హామీ ఇచ్చారని విద్యాసాగర్ పేర్కొన్నారు. ఇక.. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై కూడా చర్చలు జరిగాయని ఏపీ జేఏసీ ఛైర్మన్ చెప్పారు. 'ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచాలని ముఖ్యమంత్రిని అభ్యర్థించాం. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది సమస్యలపై కూడా ఆయన దృష్టికి తీసుకెళ్లాం. వాటిని పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఏపీ జేఏసీ ఎప్పుడూ చర్చల మార్గాన్నే అనుసరిస్తుంది. కానీ ప్రభుత్వం స్పందించని స్థితుల్లో ఉద్యమానికి ఏ మాత్రం వెనుకాడబోం' అని హెచ్చరించారు. సెప్టెంబర్ 5న ఉద్యమ శంఖారావానికి సిద్ధమైన సమయంలో సీఎంతో చర్చలు జరగడం, అవి సఫలం కావడం శుభపరిణామమని విద్యాసాగర్ అన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుతో పాటు మంత్రులు మనోహర్, పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, సత్యకుమార్, సాయి ప్రసాద్‌లకు ఏపీ జేఏసీ తరఫున ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల మూడో వారంలో రాష్ట్ర సమావేశం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటామని వెల్లడించారు.

**సీఎం స్పందన హర్షణీయం: ఏపీ జేఏసీ సెక్రటరీ కేఎస్ఎస్ ప్రసాద్**

ఉద్యోగుల సమస్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూలంగా స్పందించడం హర్షణీయమని ఏపీ జేఏసీ సెక్రటరీ కేఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. సీఎంతో నిన్న జరిగిన చర్చలు ఫలప్రదంగా సాగాయని, తమ సమస్యలను ఓపిగ్గా విని పరిష్కారానికి భరోసా ఇచ్చినందుకు సీఎంకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు సహా గురుకులాలు, సొసైటీల ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంపు అంశంపై చర్చలు జరిపినట్టు తెలిపారు ప్రసాద్. టెట్ పరీక్షలకు సంబంధించిన సమస్యలనూ సీఎం దృష్టికి తీసుకెళ్లామని, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంపై ఆయన భరోసా ఇచ్చారని చెప్పారు.

# జీవీఎంసీ డీలిమిటేషన్‌లో పారదర్శకత పాటించాలి

### 150 వార్డులు చేసినా వైసీపీ కి అభ్యంతరం లేదు

### ప్రజలకు ఇబ్బంది లేకుండా వార్డు డీలిమిటేషన్, సచివాలయం మ్యాపింగ్ చేయాలి

### జిల్లా పార్టీ అధ్యక్షులు కేకే రాజు

**విశాఖపట్నం:**



గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ వార్డుల డీలిమిటేషన్‌కు సంబంధించి అధికారులు విడుదల చేసిన నోటిఫికేషన్‌పై వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు కేకే రాజు స్పందించారు. కొంతకాలంగా కార్పొరేషన్ వార్డుల సంఖ్యపై ప్రభుత్వం, అధికారులు స్పష్టత లేకుండా వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు. తొలుత 98 నుంచి 120 వార్డులకు పెంచుతామని, మరోవైపు భీమిలి, ఆనందపురం, పద్మనాభం, పెందుర్తి తదితర గ్రామాలు, మండలాలను నగర పరిధిలో కలుపుతామని ప్రకటిస్తూ నగర ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నారని అన్నారు. ఎన్నో దశాబ్దాలుగా కలిసి మెలిసి జీవిస్తున్న గ్రామాలను డీలిమిటేషన్ పేరుతో అడ్డదిడ్డంగా విభజించడం వల్ల ఆయా ప్రాంతాల సామాజిక, సాంస్కృతిక స్వరూపం దెబ్బతింటోందన్నారు. ఒక గ్రామంతో మరో గ్రామానికి ఉన్న అనుబంధాలను తెంచుతూ, తరతరాలుగా కొనసాగుతున్న సంస్కృతి, సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను విచ్ఛిన్నం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రజల అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకోకుండా కేవలం సరిహద్దులు మార్చడం సరైన విధానం కాదన్నారు. ఈ తరహా అడ్డగోలు డీలిమిటేషన్‌పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని, గ్రామాల ఉనికిని, ప్రజల ఐక్యతను, తరతరాలుగా కొనసాగుతున్న సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.జీవీఎంసీ ని 120 వార్డులు చేసినా, 150 వార్డులు చేసినా వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కి ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలకు వెళ్లేందుకు తమ పార్టీ సిద్ధంగా ఉందన్నారు. అయితే ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, ప్రజలకు పరిపాలనా సౌలభ్యం ఉండటం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. ఇటీవల విడుదల చేసిన వార్డుల డీలిమిటేషన్ నోటిఫికేషన్‌లో మార్పులు చేయడంపై ఆయన ప్రశ్నలు లేవనెత్తారు. పార్టీ సమన్వయకర్తలు, పరిశీలకులు, మాజీ వార్డు కార్పొరేటర్లు, వార్డు పార్టీ అధ్యక్షులతో చర్చించిన అనంతరం 120 వార్డులు చేసినా, 150 వార్డులు చేసినా ఎన్నికలకు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. అయితే పరిపాలనా సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన సచివాలయాల మ్యాపింగ్ విషయంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కొన్ని ప్రాంతాల్లో ఒక వార్డుకు సంబంధించిన సచివాలయాన్ని మరో వార్డుతో మ్యాపింగ్ చేయడం వల్ల ప్రజలకు పరిపాలనా పరమైన ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. ఒక వార్డులో ఉన్న సచివాలయం అదే వార్డుకు అనుసంధానమై ఉండేలా మ్యాపింగ్ చేయాలని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కోరుకుంటోందని తెలిపారు. ప్రజల సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ మార్పులు చేపట్టాలని కోరారు. ఈ అంశంపై పార్టీ నాయకులతో కలిసి మంగళ వారం జిల్లా కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేయనున్నట్లు ఆయన వెల్లడించారు. రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా ప్రజలకు పరిపాలనా సౌలభ్యం కల్పించాలనే ఉద్దేశంతోనే తమ పార్టీ ఈ విజ్ఞప్తి చేస్తోందని స్పష్టం చేశారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా చేపట్టిన మార్పులను అధికారులు పునఃపరిశీలించాలని, ప్రజల సౌకర్యానికి అనుగుణంగా తుది నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు.

# శ్రీ గణేశ గాయత్రి బ్రాహ్మణ సేవా ట్రస్ట్ నూతన కార్యవర్గం ఏర్పాటు

**చోడవరం : సెప్టెంబరు 6, జయ జయహే**



చోడవరం గాయత్రీ బ్రాహ్మణ భవనంలో ఆదివారం శ్రీ గణేశ గాయిత్రి బ్రాహ్మణ సేవా ట్రస్టు సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. సేవా ట్రస్ట్ అధ్యక్షుడు పుత్రేవు శ్యాం ప్రసాద్ అధ్యక్షతన శ్రీ గణేశ గాయిత్రి బ్రాహ్మణ సేవా ట్రస్ట్ గౌరవాధ్యక్షులు కందర్ప కృష్ణమూర్తి (కిష్టప్ప) ఆధ్వర్యంలో సమావేశమైన సర్వ సభ్య సమావేశంలో పలు ఆర్థిక విషయాలపై చర్చలు జరిపారు. శ్రీ వేదమాత గాయిత్రి అనుగ్రహం పొందేందుకు నిత్య పూజలు, ప్రతి పౌర్ణమి నాడు లలితా పారాయణం ఏర్పాట్లపై విశేష చర్చ జరిపారు. ఏడాది పాటు శ్రీ వేదమాత గాయిత్రీదేవి పూజా కార్యక్రమాల నిర్వహణకు కీర్తిశేషులు వాడ్రేవు బుల్లి కామేశ్వరరావు జ్ఞాపకార్థం వారి కుమారుడు వాడ్రేవు శేషగిరిరావు మాస్టారు రూ. 50,000/-లు విరాళాన్ని ప్రకటించారు.ఈ ఏడాది పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన ఐదుగురు బ్రాహ్మణ విద్యార్థులకు ప్రశంసా పత్రం, పారితోషకం అందజేశారు. కీర్తిశేషులు రేగులగడ్డ శివరాం జ్ఞాపకార్థం వారి కుమారుడు నాగభూషణశర్మ, కుమార్తె వెంకటలక్ష్మి గాయత్రిలు గాయత్రి భవనానికి ఎయిర్ కూలర్ అందజేశారు. అనంతరం దస్తావేజు లేఖరుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన వడ్డాది రమేష్, స్వయంభూ కార్యసిద్ధి వినాయకుని దేవస్థానం పాలకమండలికి ధర్మకర్తగా ఎంపికైన ఉపాధ్యాయుల శ్రీనివాసరావు, ఆపదహార శ్రీనివాస క్షేత్రానికి అధికారికంగా ఎంపికైన చైర్మన్ వింజమూరి శంకర్, ధర్మకర్త ముక్కవిల్లి విస్సులను ఘనంగా సత్కరించారు. సంఘ శాశ్వత సభ్యత్వ నమోదులను పెంచుకునేందుకు సంఘ సేవా కార్యక్రమాల అభివృద్ధికి, ఐక్యతకు ప్రతీ బ్రాహ్మణ కుటుంబం సహకరించాల్సిందిగా కోరారు. నూతనంగా పారుపూడి వెంకట సత్యనారాయణ మూర్తి (సతీష్) ను ఎగ్జిక్యూటివ్ సభ్యునిగా ఎన్నుకున్నారు. సుమారు 15 మంది ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులతో మూడేళ్ల కాల పరిమితితో బ్రాహ్మణ సంఘానికి సేవ చేయగల నూతన కార్యవర్గాన్ని గౌరవాధ్యక్షులు కందర్ప కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు గోటేటి సీతారామయ్య, విశ్రాంత ఉపాధ్యాయులు గుంటూరు సత్యనారాయణ, బీహెచ్ దక్షిణామూర్తి, టీవీ శేషగిరి, కందర్ప మను, సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# సమాజ నిర్మాణంలో గురువులదే కీలకపాత్ర

### ఉత్తమ పౌరులను తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయ లోకం

### జిల్లా ఇంటిలిజెన్స్ ఎస్పీ రామోజీ రమేష్

**ఖమ్మం, సెప్టెంబర్ 6,:(జయ జయహే)**



సమాజ నిర్మాణంలో గురువులదే కీలకపాత్రని , ఉత్తమ పౌరులను తీర్చిదిద్దే బాధ్యత గురువులపైనే ఉందని జిల్లా ఇంటిలిజెన్స్ ఎస్పి రామోజీ రమేష్ తెలిపారు. స్థానిక జోయాలుకాస్ సంస్థలో ఆదివారం జరిగిన గురుపూజోత్సవ సన్మానోత్సవ కార్యక్రమానికి ఎస్పి రామోజీ రమేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఉపాధ్యాయులను, అధ్యాపకులను ఘనంగా సత్కరించారు. జోయాలుకాస్ మేనేజర్ సంతోష్ అధ్యక్షతన జరిగిన ఈ సన్మానోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథి ఎస్పి రామోజీ రమేష్ మాట్లాడుతూ నవ సమాజ నిర్మాణ గురువులతోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. సమాజంలో వివిధ రంగాలలో ఉన్నతంగా ఎదిగిన వ్యక్తులందరూ గురువుల మార్గదర్శకంలోనే ఉన్నత స్థితికి చేరారని తెలిపారు. ప్రస్తుత సమాజంలో తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తన పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పిల్లలు దుష్ప్రవర్తనకు లోనైనప్పుడు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇటీవల గురువుల పట్ల అనుచిత వైఖరి పెరుగుతున్న సందర్భాలు ఉంటున్నాయని తల్లితండ్రులు , సామాజిక సంస్థలు గురువులకు పూర్వ వైభవం తీసుకొని రావడానికి బాధ్యతాయుతంగా సహకరించాలని కోరారు. ముదిగొండ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల ఆచార్యులు అయినాల సైదులు మాట్లాడుతూ ఆధునిక ఏఐ యుగంలోనూ గురువులు చూపిన మార్గమే శిరోధార్యం అని తెలిపారు. మాజీ సైనిక ఉద్యోగి ఎస్ ఎం అరుణ్ మాట్లాడుతూ బుద్ధుడు , వర్ధమానుడు , ఏసుక్రీస్తు, అబ్దుల్ కలాం , పూలే, సావిత్రిబాయి , అంబేద్కర్ తదితరులు గురువులుగా సమాజ చైతన్యానికి దోహదపడ్డారని తెలిపారు. ప్రముఖ సాహితీవేత్త మంత్రి ప్రగడ శ్రీనివాసరావు మాట్లాడుతూ నూతన సాంకేతిక పరిజ్ఞానం ఎంత అభివృద్ధి అయినా తరగతి గదిలో ఉపాధ్యాయుడు నేర్పిన చదివు ద్వారానే విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని తెలిపారు. ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు అట్లూరి వెంకటరమణ మాట్లాడుతూ సమాజంలో గురువులకు పూర్వ వైభవం యధాతథ స్థితి కొనసాగుతుందని తెలిపారు. న్యూ విజన్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎండి అబాద్ అలీ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ వారిని సన్మార్గంలో పెట్టడంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. రిటైర్డ్ ఆచార్యులు కోయ నాగేశ్వరరావు మాట్లాడుతూ తల్లిదండ్రులు అత్యంత బాధ్యతతో పిల్లలకు దిశా నిర్దేశం చేసినప్పుడే పిల్లలు అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటారని దీనికి తమ కుమారుడు కోయ శ్రీహర్ష కలెక్టర్ కావడమే ప్రత్యక్ష ఉదాహరణ అని తెలిపారు. సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ ఓలేటి సాంబమూర్తి మాట్లాడుతూ గురువులపై అన్ని విధాలుగా ప్రస్తుతం మరింత బాధ్యత పెరిగిందని తల్లితండ్రులు గురువులకు తమ సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శాంతినగర్ స్కూల్ హెడ్మాస్టర్ చల్లగాని కృపాబాలానందం, వివిసి స్కూల్ మాధవి, సంభాని నగర్ స్కూల్ సూర్య కుమారి, డాక్టర్ ఆయేషా, గురుకుల లెక్చరర్ విమల, రిటైర్డ్ టీచర్ కొత్తపల్లి గురుప్రసాద్, గీతాంజలి స్కూల్ జానీ, రెజోనెన్స్ స్కూల్ జ్ఞానం సంతోష్, లెక్చరర్లు వడిగా రాజకుమార్, జార్జ్ , రత్న విశాల్, తదితరులు పాల్గొన్నారు. సభలో 25 మంది గురువులను శాలువాలు, జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలతో సత్కరించారు.



# శ్రీకాళహస్తీశ్వర స్వామిని దర్శించుకున్న రాష్ట్ర సమాచార కమిషనర్

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 06, జయ జయహే**

శ్రీకాళహస్తి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార కమిషనర్ గాజుల ఆదెన్న శనివారం శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీ స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం అధికారులు ఆయనకు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేసి స్వామివారి తీర్థప్రసాదాలను అందించారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి , బి.కె. వెంకటేశులు, దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు గుర్రప్పశెట్టి , టెంపుల్ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# వి. ఏ. ఎస్ చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయం

**బుచ్చయ్యపేట జయ జయహే**

బుచ్చియ్య పేట మండలం సీతయ్యపేట గ్రామంలో వజ్రపు అప్పారావు సత్యవతి(వి. ఎ.ఎస్ ) చారిటబుల్ ట్రస్ట్ సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం జామీ నాగరాజు అక్కమ్మ దంపతుల కుమర్తె శరణ్య కు పుష్పవతి కానుకగా వజ్రపు సత్యవతి చేతుల మీదుగా రూ.5000 రూపాయలు అందించారు. ఫక్షన్ కావలసిన వాటర్ ట్యాంక్ ద్వారా మంచినీరు సదుపాయం అందించారు. ప్రజలే దేవుళ్ళు - సమాజమే దేవాలయం అనే నినాదంతో ప్రజలకు సేవలు అందిస్తున్న వి ఎ ఎస్ ట్రస్ట్ సేవలను గ్రామంలో ఉన్న ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ట్రస్టు సేవలను చూసి గ్రామంలో ప్రజలు యువకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో పలక గంగాధర, పిల్ల కొండలరావు,అల్లు నాగేశ్వరరావు, బొబ్బిలి శ్రీను, దండి గణేష్, దండి సురేష్,కొండపల్లి శివ, మజ్జి సంజయ్, దండి సతీష్, కొండమంచిలి ముసలి నాయుడు, జామి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్‌లో యువత పాల్గొనాలి

### మై భారత్ డిడి మహేశ్వరరావు పిలుపు

**విశాఖపట్నం (జయ జయహే)**

వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్--2027లో ఉమ్మడి విశాఖపట్నం ప్రాంత యువత పెద్ద సంఖ్యలో పాల్గొనాలని మేరా యువభారత్ ఉప సంచాలకులు జి మహేశ్వర రావు పిలుపునిచ్చారు. భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు - క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో, మేరా యువ భారత్ నిర్వహిస్తున్న ఈ ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో యువత పాల్గొనాలని ఆయన కోరారు. 15 నుంచి 29 సంవత్సరాల వయస్సు గల యువత ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి అర్హులన్నారు. 2026 సెప్టెంబర్ 30 వరకు మేరా యువ భారత్ వేదికలో ఆన్‌లైన్ క్విజ్‌కు నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. వికసిత్ భారత్ ఛాలెంజ్ పోటీ ఆన్‌లైన్ క్విజ్, వ్యాస రచన, జిల్లా స్థాయి పోటీ, రాష్ట్ర స్థాయి పోటీ, జాతీయ స్థాయి పోటీ అనే ఐదు దశల్లో జరుగుతుందని వివరించారు.. క్విజ్‌లో ప్రతిభ కనబరిచిన వారు జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ఎంపికై జాతీయ స్థాయికి చేరుకునే అవకాశం ఉంటుందని అన్నారు. జాతీయ స్థాయిలో ఎంపికైన యువత న్యూఢిల్లీలో తమ ఆలోచనలను ప్రముఖుల సమక్షంలో ప్రదర్శించే అవకాశం పొందుతారని తెలిపారు. విశాఖపట్నం। 14,474,, అనకాపల్లి 12,009, అల్లూరి సీతారామరాజు జిల్లా 7,046మొత్తం 33,529 యువత పాల్గొంటరని అన్నారు. కళాశాలలు, విశ్వ విద్యాలయాలు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, యువజన సంఘాలు, ఇతర విద్యాసంస్థలు అర్హులైన విద్యార్థులు, యువతను ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో నమోదు చేయించి విజయవంతం చేయాలని ఉపసంచాలకులు జి మహేశ్వరరావు కోరారు.

# నేటి నుంచి కొత్త పెన్షన్లకు దరఖాస్తు చేసుకోండి

**మాడుగుల సెప్టెంబరు 6 జయ జయహే**



ఈనెల ,7వ తేదీ నుంచి 16వ తేదీ వరకు అర్హులైన లబ్ధిదారులందరూ పెన్షన్లకు దరఖాస్తు చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించి సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్లకు లాగిన్ ఇవ్వడం జరిగిందని తెలిపారు. వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత కార్మికులు, మత్స్యకారులు, డప్పు వాయిద్య కారులు, ట్రాన్స్ జెండర్స్ తదితరులు సంబంధిత ఆధార్, రేషన్ కార్డులతో పాటు సంబంధిత ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.




# ఘనంగా జర్నలిస్టు డే

**చోడవరం సెప్టెంబర్ 6 జయ జయహే**

చోడవరంలో ఆదివారం పత్రిక విలేకరుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు.వాసవి వారోత్సవాల్లో భాగంగా జర్నలిస్ట్ డే కార్యక్రమాన్ని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చోడవరం లో గల పత్రిక విలేకరులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. అలాగే పండిత ఆశీర్వచనం కూడా అందజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మన జిల్లా గవర్నర్ పూసర్ల వెంకటరమణమూర్తి, వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం చైర్మన్ కలగర్ల శేషగిరి రావు జిల్లా సెక్రటరీ పసుమర్తి మల్లికార్జున రావు ఆర్ సి పెన్నం రాజా, జెడ్ సి ఉప్పల చినరాజు లింగం గుప్తా, జిల్లా ఇంచార్జ్ కొల్లూరు మణికుమార్,రీజన్ వన్ ఆర్ సి పసుమర్తి లక్ష్మణ్,యూత్ క్లబ్ ప్రెసిడెంట్ కేతవరపు రామకృష్ణ,వాసవి క్లబ్ ప్రెసిడెంట్ పసుమర్తి రాజేష్ సెక్రటరీ కొల్లూరు శ్రీను,వనితా క్లబ్ ప్రెసిడెంట్ పసుమర్తి పూర్ణిమ,వనిత క్లబ్ సెక్రటరీ కొల్లూరు కనకమాలక్ష్మి ,యూత్ క్లబ్ ఫాస్ట్ ప్రెసిడెంట్ , డైరెక్టర్లు సభ్యులు పాల్గొన్నారు.



# ఉద్యోగం చేస్తాం.. ఊడిగం చేయం

## అంటున్న సచివాలయ ఉద్యోగులు

## ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రధాన కూడలి దిగ్బంధం చేసిన సచివాలయ ఉద్యోగులు

## బాటిళ్ల శబ్దాలతో హోరెత్తిన నగర నడిబొడ్డు

**విశాఖపట్నం, సెప్టెంబర్ 6, జయ జయహే :**

తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు చేపట్టిన ఆందోళన మరింత ఉధృతమైంది. గత మూడు రోజులుగా జీవీఎంసీ ప్రధాన కార్యాలయం ఎదుట గాంధీ విగ్రహం వద్ద కొనసాగుతున్న నిరసనకు ముగింపు రోజైన ఆదివారం ఉద్యోగులు రోడ్డుపై బైఠాయించి తమ నిరసనను తీవ్రతరం చేశారు. జోన్--1 పరిధిలోని ఉత్తరాంధ్ర ఆరు జిల్లాలకు చెందిన గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో ఆందోళనలో పాల్గొన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఆందోళనలో భాగంగా ఉద్యోగులు విశాఖ ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రధాన కూడలి వద్దకు చేరుకుని రోడ్డుపై బైఠాయించడంతో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఉద్యోగుల నినాదాలు, బాటిళ్ల శబ్దాలతో నగరం నడిబొడ్డు హోరెత్తింది.

"ఉద్యోగం చేస్తాం.. ఊడిగం చేయం" అంటూ ఉద్యోగులు నినాదాలు చేస్తూ తమ సమస్యలపై ప్రభుత్వ దృష్టిని ఆకర్షించే ప్రయత్నం చేశారు. ఆందోళన నేపథ్యంలో పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఉద్యోగులు, పోలీసుల మధ్య తోపులాట చోటుచేసుకున్నట్లు తెలిసింది.

ఉత్తరాంధ్రలోని విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన ఉద్యోగులు ఈ ఉద్యమంలో పాల్గొంటున్నారు.

తమ సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, పెండింగ్ డిమాండ్లను పరిష్కరించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు స్పష్టం చేశారు.

# హిమాలయాలు కరుగుతున్నాయి.. తస్మాత్ జాగ్రత్త

(ప్రతాప్)

**హిమాలయాలను మనం పర్వతాలుగా చూస్తాం. కానీ అవి కేవలం మంచుతో కప్పబడిన శిఖరాలు కావు. అవి ఆసియాకు నీటి నిల్వలు, అనేక మహానదులకు జన్మస్థానాలు, కోట్లాది ప్రజల జీవనాధారాలు. అందుకే హిమాలయంలో కదిలే ఒక మంచుకొండ ప్రభావం అక్కడితో ఆగదు. అది నదిగా మారుతుంది, వరదగా దిగుతుంది, చివరకు మైదానాల్లోని మనుషుల జీవితాలను తాకుతుంది.**



ఇటీవల నేపాల్‌లో సంభవించిన ఘోర విపత్తు దీనికి విషాదకరమైన ఉదాహరణ. ఆగస్టు 26న నేపాల్--చైనా సరిహద్దు హిమాలయ ప్రాంతంలో హిమానీనదం కూలిపోవడంతో సంభవించిన భారీ వరదలు, బురద ప్రవాహాలు విస్తారమైన విధ్వంసాన్ని సృష్టించాయి. సెప్టెంబరు 5 నాటికి ఈ విపత్తులో 1,300 మందికి పైగా మరణించగా, 5,000 మందికి పైగా గల్లంతైనట్లు తాజా నివేదికలు చెబుతున్నాయి. జలవిద్యుత్ కేంద్రాలు, రహదారులు, వంతెనలు, గ్రామాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి.

ఇది ఒక దేశానికి జరిగిన ప్రకృతి విపత్తు మాత్రమే కాదు. హిమాలయ పర్యావరణ అస్థిరతకు మానవ ముఖం కనిపించిన సంఘటన.

ప్రపంచ వాతావరణ మార్పుపై ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం చేస్తున్న హెచ్చరికలు ఈ నేపథ్యంలో మరింత ప్రాధాన్యత సంతరించుకుంటున్నాయి. యుఎన్‌ఈపీ 2025 నివేదిక ప్రకారం, ప్రస్తుత విధానాలు కొనసాగితే ఈ శతాబ్దంలో ప్రపంచ ఉష్ణోగ్రత పెరుగుదల సుమారు 2.8 డిగ్రీల సెల్సియస్‌కు చేరే ప్రమాదం ఉంది. దేశాలు తమ ప్రస్తుత వాతావరణ హామీలను పూర్తిగా అమలు చేసినా వేడిమి 2.3--2.5 డిగ్రీల పరిధిలో ఉండే అవకాశం ఉంది. 1.5 డిగ్రీల లక్ష్యాన్ని నిలబెట్టుకోవడం అత్యంత కఠినమైనప్పటికీ ఇంకా పూర్తిగా అసాధ్యం కాలేదని యుఎన్‌ఈపీ స్పష్టం చేస్తోంది.

ఇక్కడ ప్రతి దశాంశ డిగ్రీ ముఖ్యం. ఎందుకంటే ఉష్ణోగ్రత పెరిగే కొద్దీ హిమానీనదాలపై ఒత్తిడి, మంచు కరుగుదల, పర్వత ప్రాంతాల అస్థిరత, తీవ్రమైన వర్షాలు, ఆకస్మిక వరదలు వంటి ప్రమాదాలు పెరుగుతాయి. అయితే ప్రతి హిమాలయ విపత్తును నేరుగా వాతావరణ మార్పుకే ఆపాదించడం శాస్త్రీయంగా సరైనది కాదు. పర్వత భౌగోళిక పరిస్థితులు, భారీ వర్షాలు, మంచు--రాళ్ల కూల్చివేతలు, మౌలిక వసతుల నిర్మాణం వంటి అనేక అంశాలు కలిసి ప్రమాదాన్ని పెంచుతాయి. అందుకే శాస్త్రీయ పర్యవేక్షణ, ముందస్తు హెచ్చరికలు అత్యంత కీలకం.

భారతదేశం ఈ పరిణామాలను దూరం నుంచి చూడలేదు. హిమాలయాల నుంచి పుట్టే నదులు భారతదేశంలోని విస్తారమైన మైదాన ప్రాంతాలకు జీవనాధారం. హిమాలయాల్లో నీటి ప్రవాహాల్లో ఆకస్మిక మార్పులు సంభవిస్తే దిగువ ప్రాంతాల్లో వరదలు, వ్యవసాయం, తాగునీరు, విద్యుత్ ఉత్పత్తి, మౌలిక వసతులపై ప్రభావం పడే అవకాశం ఉంది.

భారతదేశం ఎదుర్కొంటున్న వాతావరణ ప్రమాదం ఎంత తీవ్రమో జర్మన్‌వాచ్ 2026 వాతావరణ ప్రమాద సూచిక కూడా తెలియజేస్తోంది. 1995--2024 మధ్య తీవ్ర వాతావరణ సంఘటనల వల్ల భారత్‌లో సుమారు 80,000 మంది ప్రాణాలు కోల్పోగా, 130 కోట్ల మంది ప్రభావితమయ్యారు; దాదాపు 170 బిలియన్ అమెరికన్ డాలర్ల ఆర్థిక నష్టం నమోదైంది అని నివేదిక పేర్కొంది.

అందువల్ల మన ముందున్న పరిష్కారం రెండు మార్గాల్లో సాగాలి. మొదటిది---ప్రపంచవ్యాప్తంగా ఉద్గారాలను వేగంగా తగ్గించడం. 1.5 డిగ్రీల మార్గాన్ని కొనసాగించాలంటే 2035 నాటికి ఉద్గారాల్లో భారీ కోత అవసరమని యుఎన్‌ఈపీ స్పష్టం చేసింది. రెండవది---ఇప్పటికే మారుతున్న వాతావరణానికి అనుగుణంగా మనలను సిద్ధం చేసుకోవడం.

హిమాలయాల్లో హిమానీనదాలు, మంచు సరస్సులు, నదీ ప్రవాహాలను నిరంతరం పర్యవేక్షించే శాస్త్రీయ వ్యవస్థలు బలోపేతం కావాలి. నేపాల్, భారత్, చైనా వంటి హిమాలయ దేశాల మధ్య ముందస్తు హెచ్చరికలు, ఉపగ్రహ సమాచారం, నదీ ప్రవాహ వివరాల భాగస్వామ్యం మరింత బలపడాలి. పర్వత ప్రాంతాల్లో నిర్మాణాలు ప్రకృతి సామర్థ్యాన్ని పరిగణనలోకి తీసుకుని జరగాలి. దిగువ ప్రాంతాల్లో వరద మైదానాల నిర్వహణ, అత్యవసర తరలింపు ప్రణాళికలు, ప్రజలకు ముందస్తు హెచ్చరికలు సమర్థంగా పనిచేయాలి.

వాతావరణ మార్పును ఆపడం కేవలం ప్రభుత్వాల బాధ్యత కాదు. నీటిని పొదుపు చేయడం, విద్యుత్‌ను బాధ్యతగా వినియోగించడం, అడవులను కాపాడడం, ప్రకృతిని వనరుగా మాత్రమే కాక జీవన భాగస్వామిగా చూడడం ప్రతి పౌరుడి బాధ్యత.

హిమాలయాలు మనకు ఇప్పటికీ నీటిని ఇస్తున్నాయి. ఇప్పుడు మనం వాటికి రక్షణ ఇవ్వాల్సిన సమయం వచ్చింది.

పర్వతాలపై కరిగే ప్రతి మంచుతుంపర మనకు ఒక ప్రశ్న వేస్తోంది---"మీ భవిష్యత్తు కోసం మీరు ఈరోజు ఏమి చేస్తున్నారు?"

ఆ ప్రశ్నకు సమాధానం రేపు చెప్పలేం. ఎందుకంటే హిమాలయాల్లో రేపటి హెచ్చరిక ఎప్పుడు వరదగా మారుతుందో ఎవరికీ తెలియదు.

హిమాలయాలను కాపాడటం అంటే కేవలం మంచును కాపాడటం కాదు; నదులను, పొలాలను, గ్రామాలను, నగరాలను, ఆహార భద్రతను, నీటి భద్రతను---మొత్తంగా మన భవిష్యత్తును కాపాడటం. ప్రకృతి మనల్ని హెచ్చరిస్తున్నప్పుడు వినడం విజ్ఞానం; విన్న వెంటనే చర్య తీసుకోవడం వివేకం.

# భారత ఆర్థిక వ్యవస్థకు కొత్త ఇంధనం... అభివృద్ధికి రెక్కలు

(ప్రతాప్)

**భారత ఆర్థిక వ్యవస్థకు ఇప్పుడు అత్యంత అవసరమైన ఇంధనం దేశీయ వినియోగం. ప్రపంచ ఆర్థిక అనిశ్చితులు, వాణిజ్య పరమైన అవరోధాలు, భౌగోళిక ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ దేశీయ డిమాండ్ బలంగా ఉండటం భారత వృద్ధికి రక్షణ కవచంగా మారుతోంది. 2025--26లో వాస్తవ స్థూల దేశీయోత్పత్తి 7.7 శాతం పెరగగా, అదే కాలంలో ప్రైవేటు తుది వినియోగ వ్యయం 7.7 శాతం వృద్ధి చెందడం గమనార్హం. ఆర్థిక వ్యవస్థలో ప్రధాన డిమాండ్ ఆధారంగా వినియోగం మరింత ప్రాధాన్యం సంతరించుకుంటోంది.**

వినియోగ సామర్థ్యాన్ని అర్థం చేసుకోవాలంటే గ్రామీణ భారతాన్ని విస్మరించలేం. 2023--24 కుటుంబ వినియోగ వ్యయ సర్వే ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో ఒక్క వ్యక్తి సగటు నెలసరి వినియోగ వ్యయం రూ.4,122 కాగా, పట్టణ ప్రాంతాల్లో అది రూ.6,996. ఉచితంగా లభించిన వస్తువుల విలువను కలిపితే ఈ మొత్తాలు వరుసగా రూ.4,247, రూ.7,078కు చేరాయి. గ్రామీణ వినియోగం పెరగడం అంటే కేవలం కుటుంబాల కొనుగోళ్లు పెరగడం కాదు; వ్యవసాయం, చిన్న వ్యాపారాలు, రవాణా, వినియోగ వస్తువులు వంటి అనేక రంగాలకు డిమాండ్ పెరగడం.

పట్టణ మధ్యతరగతి కూడా వృద్ధికి కీలక ఆధారం. గృహాలు, వాహనాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, విద్య, ఆరోగ్యం, పర్యటన, ఆహార సేవలపై ఖర్చు పెరిగితే దాని ప్రభావం ఉత్పత్తి, సేవలు, పెట్టుబడులపై కనిపిస్తుంది. అయితే ఆదాయం పెరగకుండా కేవలం రుణాల ఆధారంగా వినియోగం పెరగడం దీర్ఘకాలిక పరిష్కారం కాదు. ఉపాధి కలిగించే వృద్ధి ద్వారానే వినియోగానికి స్థిరమైన పునాది ఏర్పడుతుంది.



ఇక్కడ ద్రవ్యోల్బణం కీలకం. 2026 జూన్‌లో వినియోగదారుల ధరల ఆధారిత ద్రవ్యోల్బణం 4.38 శాతంగా ఉండగా, ఆహార ద్రవ్యోల్బణం 5.32 శాతంగా నమోదైంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ధరల ఒత్తిడి 4.74 శాతంగా ఉండటం గమనించాలి. ధరలు అదుపులో ఉంటేనే కుటుంబాల వాస్తవ కొనుగోలు శక్తి పెరుగుతుంది.

వడ్డీ రేట్ల విషయంలోనూ సమతుల్యత అవసరం. భారతీయ రిజర్వు బ్యాంకు ఆగస్టు 2026లో విధాన పునర్వడ్డీ రేటును 5.25 శాతం వద్ద కొనసాగించింది. ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచుతూనే రుణ వ్యయం తగ్గే పరిస్థితులు కల్పించడం వినియోగం, గృహ నిర్మాణం, చిన్న పరిశ్రమలు, పెట్టుబడులకు తోడ్పడుతుంది.

అందువల్ల ముందున్న కార్యాచరణ స్పష్టంగా ఉండాలి. గ్రామీణ ఆదాయాలను పెంచే వ్యవసాయ అనుబంధ రంగాలకు ప్రోత్సాహం, నాణ్యమైన ఉపాధి సృష్టి, నైపుణ్యాభివృద్ధి, చిన్న పరిశ్రమలకు సులభ రుణాలు, ఆహార ధరల స్థిరీకరణ, ఉత్పాదక పెట్టుబడులకు ప్రాధాన్యం ఇవ్వాలి. అలాగే వేతనాలు, ఉత్పాదకత, వినియోగం పరస్పరం బలపడే వాతావరణం నిర్మించాలి. స్థూల దేశీయోత్పత్తి పెరగడం ఆర్థిక విజయానికి కొలమానం మాత్రమే; ఆ వృద్ధి ప్రతి కుటుంబం ఆదాయంలో, కొనుగోలు శక్తిలో, ఉపాధిలో, జీవన ప్రమాణంలో ప్రతిబింబించినప్పుడే అది నిజమైన అభివృద్ధి. వినియోగాన్ని పెంచడం లక్ష్యం కావచ్చు; కానీ ఆదాయాన్ని పెంచే సామర్థ్యంతో కూడిన వినియోగమే భారత వృద్ధికి శాశ్వత ఇంధనం.



## అన్నవరం ప్రసాదాల తయారీపై

# ప్రత్యేక దృష్టి

## భూతాదిని పరిశీలించిన దేవాలయ అధికారులు

## కార్తీక మాసం నేపథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు

**అన్నవరం, సెప్టెంబర్ 6, జయ జయహే**

రాబోయే పవిత్ర కార్తీక మాసం, పుష్కరాల సందర్భముగా అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానానికి భక్తుల రాక విశేషంగా పెరిగే అవకాశం ఉండటంతో ఆ మేరకు స్వామివారి ప్రసిద్ధ ప్రసాదం తయారీని భారీగా పెంచేందుకు అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఆదివారం దేవస్థానం కొండపైగల "భూతాది" (ప్రసాదం తయారు చేసే సెక్షన్ ) ని అధికారులు ప్రత్యేకంగా పరిశీలించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ప్రసాదం కొరత రాకుండా ఉండేందుకు గాను, కిచెన్ విభాగంలో పొయ్యిల సంఖ్యను పెంచేందుకు, ఆధునీకరణ తయారీ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచే విషయమై ప్రణాళికలు రూపొందించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో దేవాదాయ చీఫ్ ఇంజనీర్ శేఖర్, కార్యనిర్వాహక అధికారి నల్లం సూర్యచక్రధర రావు , ట్రస్ట్ బోర్డు మెంబర్లు, ప్రముఖ దాతలు మట్టే ప్రసాద్, ఎం ఎస్ రెడ్డి , ఈ ఈ రామకృష్ణ , భూతాది పర్యవేక్షణ అధికారి రామకృష్ణ మరియు ఇంజనీరింగ్ విభాగానికి చెందిన అధికారులు పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, స్వామివారి ప్రసాదాన్ని మరింత నాణ్యతతో, వేగంగా, ఎక్కువ మొత్తంలో అందించడమే లక్ష్యంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారి నల్లం సూర్యచక్రధరరావు విలేకరులకు తెలిపారు.

# దివ్యాంగుల చైతన్యంతో విశ్వ సౌభాగ్యం





**డాబాగార్డెన్స్, విశాఖపట్నం, సెప్టెంబర్ 6**

దివ్యాంగుల్లో చైతన్యం, ఆత్మవిశ్వాసం పెంపొందించడం ద్వారా విశ్వ సౌభాగ్యాన్ని సాధించవచ్చని దివ్యాంగుల సాధికారత--సమానత్వ నిర్ధారణ యాత్ర చీఫ్ కోఆర్డినేటర్ అతుల్ అన్నారు. ఆదివారం డాబాగార్డెన్స్‌లోని వైజాగ్ జర్నలిస్ట్స్ ఫోరం ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర దివ్యాంగుల జనసేవ ప్రచార కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అతుల్ మాట్లాడుతూ విజయనగరంలో ప్రారంభమైన సాధికారత--సమానత్వ నిర్ధారణ యాత్ర రాష్ట్రంలోని ప్రముఖ జిల్లాలు, నగరాల మీదుగా విజయవాడకు చేరుకుంటుందని తెలిపారు. సెప్టెంబర్ 19న ఈ యాత్ర ముగుస్తుందని వెల్లడించారు. యాత్రలో భాగంగా దివ్యాంగుల సంక్షేమం, సాధికారతపై అవగాహన కల్పించడంతో పాటు వారికి ప్రోత్సాహం అందిస్తున్న స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థల నిర్వాహకులకు ప్రత్యేక శిక్షణ, అవసరమైన సామగ్రిని అందజేస్తున్నామని చెప్పారు. దివ్యాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె. కవిత మాట్లాడుతూ ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం, సాధికారత కోసం వివిధ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. దివ్యాంగులకు అవసరమైన సహాయ సహకారాలను అందిస్తూ వారి అభ్యున్నతికి కృషి చేస్తున్నామని తెలిపారు. బ్రహ్మకుమారి బి కే రామేశ్వరి మాట్లాడుతూ శారీరక పరిమితులు ఉన్నప్పటికీ దివ్యాంగులు నిరుత్సాహానికి లోనుకాకుండా సకలాంగులతో సమానంగా అన్ని రంగాల్లో పోటీపడుతూ తమ ప్రతిభను చాటుతున్నారని అన్నారు. బ్రహ్మకుమారులు మణి, సత్యవతి, గంట్ల శ్రీనుబాబు, హిమాచల్‌ప్రదేశ్ నుంచి వచ్చిన బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ప్రతినిధి సంజీవ్ ప్రసంగించారు ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ ఆర్. నాగరాజు పట్నాయక్, లెబెన్ షిల్ఫీ నిర్వాహకురాలు గుమ్మలూరి లక్ష్మి, సంఘమిత్ర సేవా సంస్థ నిర్వాహకుడు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం లెబెన్ షిల్ఫీకి చెందిన దివ్యాంగులు ప్రదర్శించిన నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి..



## విద్యుత్ తీగపై కాకితో స్పార్క్.. గడ్డివామికి అగ్నిప్రమాదం

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 06, జయ జయహే**

శ్రీకాళహస్తి: మండలంలోని ముచ్చివోలు గ్రామానికి చెందిన రైతు బాగిర్తి శంకరయ్యకు చెందిన గడ్డివామికి విద్యుత్ తీగపై కాకి వాలడంతో ఏర్పడిన స్పార్క్ కారణంగా మంటలు చెలరేగి అగ్నిప్రమాదం సంభవించింది. సమాచారం అందుకున్న జనసేన నాయకులు దండి నరేంద్ర వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. స్పందించిన అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టారు. గ్రామస్థుల అప్రమత్తత, అగ్నిమాపక సిబ్బంది సత్వర స్పందనతో ప్రమాదం అదుపులోకి వచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా విద్యుత్ తీగలను క్రమబద్ధీకరించాలని, సాధ్యమైన చోట భూగర్భ విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు. రైతులు విద్యుత్ తీగలకు సమీపంలో గడ్డివాములు ఏర్పాటు చేయకుండా అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు.

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా రత్నకుమార్

**ఏర్పేడు, సెప్టెంబర్ 06, జయ జయహే**

ఏర్పేడు మండలం మడిబాక గ్రామపంచాయతీ పరిధిలోని రాజుల కండ్రిగ ఆదర్శ పాఠశాలలో 28 ఏళ్లుగా విశేష సేవలందిస్తూ, విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తున్న ఉపాధ్యాయుడు రత్నకుమార్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధితో పాటు వారి ప్రతిభను వెలికితీయడంలో రత్నకుమార్ చేసిన కృషిని గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేశారు. పురస్కారం అందుకున్న సందర్భంగా రత్నకుమార్ మాట్లాడుతూ తన సేవలను గుర్తించి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ పురస్కారం తనపై మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులో విద్యార్థుల ఉన్నతికి, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి మరింత శ్రమిస్తానని తెలిపారు. తనకు సహకరించిన తోటి ఉపాధ్యాయులు, సిబ్బంది, ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇదే పాఠశాలలో 18 ఏళ్లుగా విశేష సేవలందిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు ఆర్. బాలసరస్వతి మండల ఉత్తమ ఉపాధ్యాయురాలిగా పురస్కారం అందుకున్నారు. విద్యాశాఖలో తన సేవలతో పాటు పాఠశాల అభివృద్ధికి ఆమె విశేష కృషి చేస్తున్నారు. పాఠశాలలో విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని పెంచడం, డిజిటల్ బోధనను ప్రోత్సహించడం, మౌలిక వసతుల కల్పనకు కృషి చేయడం, విద్యార్థులను క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో రాణించేలా ప్రోత్సహించడంలో బాలసరస్వతి కీలక పాత్ర పోషించారు. ఇద్దరు ఉపాధ్యాయులకు పురస్కారాలు లభించడంపై పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.






## గ్రామీణ వైద్యులకు ప్రోత్సాహక సర్టిఫికెట్లు అందజేత

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 06, జయ జయహే**

శ్రీకాళహస్తి తిరుపతి జిల్లా గ్రామీణ ప్రాంత వైద్యులకు ప్రోత్సాహక సర్టిఫికెట్ల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం శ్రీకాళహస్తిలోని వైష్ణవి ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో, వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు, డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ జడపల్లి రుద్రయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ డాక్టర్ గుడ్లూరు మయూర్ గౌరవ అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పి.ఎం.పి వెల్ఫేర్ అసోసియేషన్ శ్రీకాళహస్తి జోన్ గౌరవ అధ్యక్షులు డి. ఏడుకొండలు మాట్లాడుతూ శ్రీకాళహస్తి జోన్ పరిధిలోని గ్రామీణ ప్రాంత ప్రాథమిక వైద్యులకు వైద్య విజ్ఞానాన్ని అందించడం, ప్రజలకు మెరుగైన ప్రాథమిక వైద్య సేవలు అందించేలా అవగాహన కల్పించడం కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. గత జనవరిలో శ్రీకాళహస్తిలోని ఎంజీఎం హాస్పిటల్స్‌లో గ్రామీణ ప్రాంత వైద్యులకు ఆర్.ఎం.పి శిక్షణా తరగతులు నిర్వహించి పలు వైద్యపరమైన అంశాలపై అవగాహన కల్పించినట్లు డాక్టర్ గుడ్లూరు మయూర్ తెలిపారు. శిక్షణలో పాల్గొన్న వైద్యులకు ప్రోత్సాహం అందించేందుకు సర్టిఫికెట్లు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న సుమారు 150 మంది గ్రామీణ వైద్యులకు డాక్టర్ గుడ్లూరు మయూర్ చేతుల మీదుగా ప్రోత్సాహక సర్టిఫికెట్లు అందజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక వైద్య సేవలు అందిస్తున్న వైద్యులకు ఇటువంటి శిక్షణా కార్యక్రమాలు మరింత ఉపయోగకరంగా ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, వైద్యులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఒక్కరి అవయవ దానం పలువురికి పునర్జన్మ

## తిరుమల మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో అవగాహనలో వైద్యులు వెల్లడి

**విజయనగరం, సెప్టెంబర్ 6, జయ జయహే**

ప్రపంచ అవయవ దాన దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుమల మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో అవయవ దానంపై ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆసుపత్రి సెంట్రల్ హెడ్ డాక్టర్ పవన్ కుమార్, గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ దుర్గాసాయి, కార్డియాలజిస్ట్ డాక్టర్ జె. శ్రీకరణ్, అనస్తీషియా వైద్యులు దుర్గాప్రసాద్, నెఫ్రాలజీ వైద్యులు జస్వంత్, యూరాలజీ వైద్యులు సూర్య నిహార్ పాల్గొని మాట్లాడుతూ అవయవ దానంపై ప్రజల్లో మరింత అవగాహన పెరగాల్సిన అవసరం ఉందన్నారు. బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తుల నుంచి కిడ్నీలు, గుండె, ఊపిరితిత్తులు వంటి పలు అవయవాలను సేకరించి అవసరమైన వారికి మార్పిడి చేయవచ్చని తెలిపారు. ఇటీవల ముగ్గురు బ్రెయిన్ డెడ్ వ్యక్తుల కుటుంబాలు ముందుకు వచ్చి అవయవ దానం చేయడం ద్వారా ఆరుగురి ప్రాణాలను కాపాడగలిగామని, అవయవాలు పొందిన వారు ప్రస్తుతం ఆరోగ్యంగా జీవిస్తున్నారని వివరించారు. వైద్యపరంగా లివర్, స్మాల్ ఇంటెస్టైన్, ప్యాంక్రియాస్ వంటి అవయవాల మార్పిడి కూడా సాధ్యమవుతుందని వైద్యులు తెలిపారు. లివర్ సిరోసిస్ వంటి వ్యాధుల కారణంగా ప్రతి సంవత్సరం లక్షలాది మంది తీవ్రంగా ప్రభావితమవుతున్నప్పటికీ, అవసరమైన స్థాయిలో లివర్ ట్రాన్స్‌ప్లాంట్లు జరగడం లేదన్నారు. అవయవ మార్పిడి అవసరమైన వారికి, అందుబాటులో ఉన్న అవయవాలకు మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించేందుకు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఒక వ్యక్తి అవయవ దానం చేయడం ద్వారా పలువురికి కొత్త జీవితాన్ని అందించే అవకాశం ఉంటుందని వైద్యులు తెలిపారు. మరణానంతరం కూడా తమ అవయవాలతో పలువురికి ప్రాణదానం చేసే గొప్ప అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అవయవ దానం కేవలం ఒక దానం కాదని, మరొకరి జీవితాన్ని నిలబెట్టే మహత్తర సేవ అని వైద్యులు పేర్కొన్నారు.




## పీస్ సంస్థ సేవలు సామాన్యులకు చేరుతున్నాయి: భీశెట్టి బాబ్జి

### ఉపాధ్యాయులను సత్కరించిన పీస్ సంస్థ!

**విజయనగరం (జయ జయహే)**

పీస్ సంస్థ సేవలు సామాన్యులకు చక్కగా చేరుతున్నాయని సంస్థ అధ్యక్షురాలు సుధారాణి నిరంతరం ప్రజా సమస్యల పై కృషి చెయ్యడమే కాకుండా సామాన్య విద్యార్థులకు మంచి విద్య ఆందేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నారని జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు గురుపౌర్ణమి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గురజాడ పబ్లిక్ లైబ్రరీ లో జిల్లా లోని ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులను సత్కరించారు ఈ సందర్భంగా భీశెట్టి మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు చిన్నపాటి జీతాలతో పని వత్తిడి ఉన్నప్పటికీ విద్యార్థుల భవిష్యత్తు కోసం నిరంతరం శ్రమిస్తున్నారని అటువంటి ఉపాధ్యాయులను గుర్తించి సత్కరించడం అభినంద నీయమని అన్నారు, ప్రముఖ వ్యాపార వేత్త యెజ్జు మురళి కృష్ణ మాట్లాడుతూ విద్యా వ్యవస్థ లో మార్పులను గమనిస్తూ యువతను అద్భుతమైన రీతిలో తయారు చెయ్యవలసిన బాధ్యత అందరిపై ఉందని యువత తమ చదువుతో పాటుగా నైపుణ్యత కలిగిన అదనపు కోర్సులు చదవాలని అన్నారు, ప్రతి యేటా పీస్ సంస్థ విద్యా అభివృద్ధి కోసం చేస్తున్న కార్యక్రమానికి తనని ఆహ్వానించడం ఆనందంగా ఉందని అన్నారు, చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రైవేట్ టీచర్ల సమస్యల పై కూడా దృష్టి సా రిస్తున్నామని అన్నారు, ఈ సమావేశం లో 150 మందికి పైగా ఉపాధ్యాయులను సత్కరించారు మహిళా న్యాయ వాది పి. రుక్మిణి, మాదవి, సింహచలం, గోవింద, తో పాటుగా పెద్ద ఎట్టున ప్రైవేట్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## రూ.9 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**ఎండాడ, సెప్టెంబర్ 6:(జయ జయహే)**

జీవీఎంసీ 8 వ వార్డులో రూ.9 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మౌలిక సదుపాయాల కల్పనకు మధురవాడ జోన్ లో రూ. 1,375 కోట్లు ఖర్చు చేస్తున్నామని చెప్పారు. 22 వేల ఇళ్లకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కనెక్షన్ల కోసం రూ. 650 కోట్లతో ప్రతిపాదించిన ప్రాజెక్టు.. అలాగే 25 వేల ఇళ్లకు నిరంతరం తాగునీటి సరఫరా కోసం రూ. 725 కోట్లతో చేపట్టనున్న రెండు ప్రాజెక్టులు 2028 నాటికి అందుబాటులోకి వస్తాయని వివరించారు. ఈ ప్రాజెక్టులు ఇంకో రెండేళ్లలో ప్రజలకు అందుబాటులోకి రానున్నాయన్నారు. ఎండాడ హైవే నుంచి బీచ్ రోడ్డు వరకు రూ. 4.30 కోట్లతో రోడ్డు విస్తరిస్తున్నామని, అలాగే బ్యూటిఫికేషన్ కోసం మరో రూ. 1.50 కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. గీతం 100 అడుగుల రోడ్డు నుంచి టి.ఎస్.ఆర్. వేదిక మీదుగా శ్రీరామ్ ప్రాపర్టీస్ వరకు రూ. 1.50 కోట్లతో రోడ్డు అభివృద్ధి చేస్తున్నామన్నారు. వివిధ ప్రాంతాల్లో సీసీ డ్రెయిన్లు, కల్వర్టులు, మోడ్రన్ టాయ్ లెట్ల కోసం రూ.కోటి 12 లక్షలు కేటాయించామని చెప్పారు. వెండార్ జోన్, చంద్రంపాలెం బ్రిడ్జి పనుల ఆలస్యంపై అధికారులపై గంటా ఆగ్రహం వ్యక్తం చేశారు. జోనల్ కమిషనర్ అయ్యప్ప నాయుడు, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, చెట్టుపల్లి సన్యాసిరావు, శాఖరి శ్రీనివాస్, లొడగల అప్పారావు, చెట్టిపల్లి గోపీ, దొరబాబు, మొల్లి లక్ష్మణరావు, పోతిన శివ, మంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత టి. రాజగోపాల్ రెడ్డి కన్నుమూత

**బుచ్చినాయుడు, సెప్టెంబర్ 06, జయ జయహే**



బుచ్చినాయుడు కండ్రిగ ఉమ్మడి చిత్తూరు జిల్లా కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకుడిగా, జిల్లా స్థాయి కీలక నేతగా, ప్రముఖ సీనియర్ కాంట్రాక్టర్‌గా గుర్తింపు పొందిన టి. రాజగోపాల్ రెడ్డి (95) వృద్ధాప్య సమస్యలతో కన్నుమూశారు. తిరుపతి జిల్లా బుచ్చినాయుడు కండ్రిగ మండలం వెస్ట్ వారత్తూరు గ్రామానికి చెందిన రాజగోపాల్ రెడ్డి మృతి పట్ల రాజకీయ, వ్యాపార రంగాలకు చెందిన ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రాజగోపాల్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో సాధారణ కార్యకర్తగా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. అనంతరం నిరంతర కృషి, పట్టుదలతో జిల్లా స్థాయిలో సీనియర్ నాయకుడిగా ఎదిగారు. దశాబ్దాల పాటు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఆయన చేసిన సేవలు విశేషమైనవిగా పార్టీ నాయకులు పేర్కొన్నారు. పార్టీకి చెందిన పలువురు సీనియర్ నాయకులతో సత్సంబంధాలు కొనసాగిస్తూ, నియోజకవర్గ, జిల్లా రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారు. ప్రజా సేవలోనూ ముందుండి పనిచేసిన ఆయన, కాంట్రాక్టర్‌గా కూడా అనేక మందికి ఉపాధి అవకాశాలు కల్పించారు. రాజకీయ, సామాజిక, వ్యాపార రంగాల్లో ఆయనతో ఉన్న అనుబంధాన్ని పలువురు ప్రముఖులు గుర్తుచేసుకున్నారు. ఈరాజగోపాల్ రెడ్డి మృతి పట్ల పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కాంట్రాక్టర్లు, వ్యాపారవేత్తలు సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.

For a pure tomorrow.. జయహే

## మట్టి మాఫియా ఆగడాలను అరికట్టాలి

# అధికారులు మొద్దు నిద్రను వీడాలి

**తొట్టంబేడు, సెప్టెంబరు 06, జయ జయహే**

తొట్టంబేడు మండలం, గుండేలి గుంట గ్రామం, వాస్తవ్యులు చంద్రశేఖర్ ను మట్టి మాఫియా ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో మృతి చెందిన కారణంగా చంద్రశేఖర్ పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన కాంగ్రెస్ నేతలు. డిసిసి అధ్యక్షులు బాలగురవం బాబు, శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి మృతుని ఇంటి వద్దకు చేరుకొని పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి, మృతుని కుటుంబానికి ప్రభుత్వం వెనువెంటనే అన్ని రకాలుగా ఆదుకోవాలని అదేవిధంగా నేడు శ్రీకాళహస్తి నియోజకవర్గం లో మట్టి మాఫియా పేట్రేగిపోతోందని, గడిచిన కొంతకాలంలోనే సుమారుగా రెండు మరణాలు సంభవించాయని ఒకరు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కాగా మరొకరు శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం ఒప్పంద కార్మికుడు కావడం గమనార్హం అని, మృతుని పార్థివ దేహం వద్ద నుంచే సంబంధిత అధికారులకు చరవాణి ద్వారా డిసిసి అధ్యక్షులు బాలగురవం బాబు మాట్లాడి వారి కుటుంబానికి అన్ని విధాలుగా న్యాయం చేకూర్చాలని లేకపోతే కాంగ్రెస్ పార్టీ తరఫున తీవ్రమైనటువంటి నిరసన



కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఇంత ఘోరమైన సంఘటనలు జరుగుతున్న సంబంధిత అధికారులు మొద్దు నిద్ర వీడడం లేదని, వారు నిందితులపై తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట నియోజకవర్గ సమన్వయకర్త డి కిరణ్, జిల్లా ఉపాధ్యక్షులు కరీముల్లా, శ్రీకాళహస్తి మండలం అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, శ్రీకాళహస్తి పట్టణ యువజన అధ్యక్షులు ఆంటోనీ,అరుణ్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

## 2029 నాటికి డ్రగ్స్ రహిత

# భారతదేశమే లక్ష్యం

## డ్రగ్స్ రహిత భారత్‌తోనే 'వికసిత్ భారత్' కల సాకారం: అమిత్ షా

**జయ జయ హే**

డ్రగ్స్ రహిత భారత్‌తోనే 'వికసిత్ భారత్' కల సాకరమవుతుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలిపారు. 2029 నాటికి దేశాన్ని పూర్తిగా డ్రగ్స్ రహితంగా మార్చేందుకు కేంద్రం స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేసిందని వెల్లడించారు. గోవా పర్యటనలో భాగంగా ఆ రాష్ట్ర సీఎం ప్రమోద్ సావంత్‌తో అమిత్ షా ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో మాట్లాడిన అమిత్ షా, నక్సలిజాన్ని దేశం నుంచి ఏ విధంగా నిర్మూలించామో, అదే రీతిలో మత్తుపదార్థాల ముప్పును కూడా పూర్తిగా తుడిచిపెడతామని ధీమా వ్యక్తం చేశారు.

"2047 నాటికి మాదకద్రవ్యాలు లేని యువశక్తి వికసిత్ భారత్‌ను ముందుకు **మొదటి పేజీ తరువాయి...**




నడిపించాలనేది ప్రధాని మోదీ లక్ష్యం. 2014 కంటే ముందు, నార్కోటిక్స్ (మాదక ద్రవ్యాల)పై పోరాటం చాలా వరకు చిన్న చిన్న విభాగాలుగు, ఒంటరిగానే సాగింది. అప్పట్లో ఏజెన్సీలు చిన్న చిన్న నిందితులను పట్టుకోవడంతోనే సరిపెట్టుకునేవి. కానీ మా ప్రభుత్వం ఈ పోరాటాన్ని జాతీయ భద్రతకు సంబంధించిన అత్యంత ముఖ్యమైన అంశంగా తీసుకుంది" అని అమిత్ షా అన్నారు.

పక్కా ప్లాన్‌తో డ్రగ్స్ నివారణ

2029 నాటికి మాదకద్రవ్య రహిత భారతే మా లక్ష్యం. అందుకే డ్రగ్స్ అక్రమ రవాణా, నిధుల సమీకరణ నుంచి పునరావాసం వరకు మొత్తం మాదక ద్రవ్యాల నెట్‌వర్క్‌ను నిర్మూలించడానికి కేంద్రం ఒక పక్కా వ్యూహాన్ని అవలంబిస్తోంది. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రత్యేక మాదక ద్రవ్యాల నిరోధక టాస్క్‌ఫోర్స్‌లను (ఏఎన్ టీఎఫ్) ఏర్పాటు చేశాం. స్థానిక పోలీసులను జాతీయ వ్యూహంతో అనుసంధానించాం. అంతేకాదు మాదక ద్రవ్యాల నియంత్రణ బ్యూరో కేడర్‌ను పునర్వ్యవస్థీకరించి, దాని సిబ్బందిని, కార్యాచరణ సామర్థ్యాలను పెంచడం ద్వారా బలోపేతం చేశామని అమిత్ షా చెప్పారు.

"మా ప్రభుత్వం మాదక ద్రవ్యాల నిరోధక ప్రచారం చేస్తుంది. అవగాహన, చికిత్స, కౌన్సిలింగ్, పునరావాసం, జీవనోపాధి అవకాశాలను అనుసంధానిస్తాం. అంతేకాదు డ్రగ్స్‌కు బానిసలైన వ్యక్తులకు మద్దతు ఇవ్వడానికి 1933 మానస్ హెల్ప్‌లైన్‌ను ప్రవేశపెట్టాం. ఈ రాజకీయ సంకల్పం, సమన్వయంతో కూడిన చర్యలతో 2029 నాటికి మాదకద్రవ్య రహిత భారత్‌ను సాధించడమే లక్ష్యంగా మోదీ సర్కార్ పనిచేస్తోంది" అని అమిత్ షా స్పష్టం చేశారు.

మా పాలనలో కశ్మీర్ ప్రశాంతం!

ప్రధాని మోదీ హయాంలో జమ్మూకశ్మీర్ ఉగ్రవాదం తగ్గుముఖం పట్టిందని అమిత్ షా అన్నారు. అందుకే ఇప్పుడు ఆ ప్రాంతం అభివృద్ధి సాధిస్తూ, ప్రగతి పథంలో పయనిస్తోందని అన్నారు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్మూకశ్మీర్‌లో వేర్పాటువాద భావనలు తగ్గాయని ఆయన అన్నారు. దేశ అంతర్గత భద్రతను మరింత మెరుగుపర్చడానికి కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని చెప్పారు.

నక్సలిజం ఇప్పుడు గతమైపోయింది!

ఐదు దశాబ్దాలుగా దేశాన్ని పీడించిన నక్సలిజం ఇప్పుడు గతంగా మారిపోయిందని అమిత్ షా అన్నారు. "తిరుపతి నుంచి పశుపతినాథ్ వరకు 'రెడ్ (మావోయిస్టు) కారిడార్' నిర్మించాలని కలలు కన్నవారు, నేడు ఆయుధాలు వీడి ప్రధాన స్రవంతిలో చేరారు. ఈశాన్య రాష్ట్రాలు కూడా ఇప్పుడు ప్రశాంతంగా ఉన్నాయి. అక్కడ 11వేల మందికి పైగా యువకులు ఆయుధాలు విడిచిపెట్టారు. మేము కన్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించాం. మాదక ద్రవ్యాల ముప్పును కూడా అదే పద్ధతిలో ఎదుర్కొంటాం" అని అమిత్ షా స్పష్టం చేశారు.

పరారీలో ఉన్న నేరస్తులను వెనక్కి రప్పిస్తాం!

2029 మార్చి నాటికి 100 జాతీయ, అంతర్జాతీయ నెట్‌వర్క్‌లను ధ్వంసం చేయడం, 100 మంది పరారీలో ఉన్న నేరస్తులను దేశానికి తిరిగి తీసుకురావడమే కేంద్రం లక్ష్యమని అమిత్ షా చెప్పారు. మార్చి 2029 నాటికి 100 జాతీయ మరియు అంతర్జాతీయ నెట్‌వర్క్‌లను ధ్వంసం చేయడం మరియు 100 మంది పరారీలో ఉన్న నేరస్తులను దేశానికి తిరిగి తీసుకురావడం కేంద్రం లక్ష్యమని షా చెప్పారు. విదేశాల్లో దాక్కున్న, పరారీలో ఉన్న నేరస్తులను తిరిగి తీసుకురావడం కోసం తమ ప్రభుత్వం మిషన్-మోడ్ విధానంతో ముందుకు వెళ్తోందని అన్నారు. 2019 జులై నుంచి 2026 జులై మధ్య కాలంతో 36 దేశాల నుంచి 274 మంది మోస్ట్ వాంటెడ్ నేరస్థులను భారతదేశానికి తిరిగి తీసుకొచ్చినట్లు ఆయన తెలిపారు.

# తెలంగాణలో 369 ఈవీ ఛార్జింగ్ స్టేషన్లు

### టెండర్లకు టీజీ రెడ్కో ఆహ్వానం

### 200 ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు టెండర్లు

### టీజీఎన్‌పీడీసీఎల్ పరిధిలో 169 ఈవీ ఛార్జింగ్ స్టేషన్లకు టెండర్లు -

### ఆరు క్లస్టర్లలో 200 ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు

**జయ జయహే**

తెలంగాణలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని మరింత పెంచడంతో చేయడంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా పబ్లిక్ ఈవీ ఛార్జింగ్ మౌలిక వసతులను భారీగా విస్తరించేందుకు తెలంగాణ పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (టీజీ రెడ్కో) కీలక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా మొత్తం 369 పబ్లిక్ ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు, నిర్వహణ, అప్‌గ్రేడేషన్, వాణిజ్య నిర్వహణ కోసం ప్రైవేట్ ఛార్జ్ పాయింట్ ఆపరేటర్లను (సీపీఓలు) ఆహ్వానిస్తూ టెండర్ల ప్రకటనను జారీ చేసింది. తెలంగాణలో ఎలక్ట్రిక్ వాహనాల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో, వాటికి అనుగుణంగా పబ్లిక్ ఛార్జింగ్ మౌలిక సదుపాయాలను విస్తరించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. పెరుగుతున్న విద్యుత్తు వాహనాల మార్కెట్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రైవేట్ రంగం



ఈ అవకాశాలను అందిపుచ్చుకునేలా ప్రణాళిక చేసింది. దీర్ఘకాలికంగా, వాణిజ్యపరంగా నిలకడైన ఈవీ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేయడమే టీజీ రెడ్కో ముఖ్య లక్ష్యం అని రెడ్కో ఎండీ ముషారఫ్ ఫారూఖీ పేర్కొన్నారు.

10 సంవత్సరాలపాటు కాంట్రాక్ట్ : హైదరాబాద్ పరిధిలోని జీహెచ్ఎంసీ, సైబరాబాద్, మల్కాజ్‌గిరి మున్సిపల్ ప్రాంతాలను కవర్ చేస్తూ రెడ్కో సంస్థ ఏర్పాటు చేసిన 200 పబ్లిక్ ఈవీ ఛార్జింగ్ స్టేషన్లను ఆరు క్లస్టర్లుగా అభివృద్ధి చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఎంపికైన సీపీఓలు వీటి ఆపరేషన్, మెయింటెనెన్స్, అప్‌గ్రేడేషన్, వాణిజ్య నిర్వహణ బాధ్యతలను చేపడతారని, ప్రాజెక్టు కాంట్రాక్ట్ కాలం 10 సంవత్సరాలు ఉంటుందన్నారు. టీజీఎస్పీడీసీఎల్ పరిధిలోని వరంగల్, ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల్లోని 16 ప్రాంతాల్లో 169 పబ్లిక్ ఈవీ ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని చూస్తున్నామని రెడ్కో ఎండీ ముషారఫ్ ఫారూఖీ తెలిపారు.

టారిఫ్‌ను యూనిట్‌కు రూ.13 : ఎంపికైన సీపీఓలు సర్వే, డిజైన్, సరఫరా, సివిల్ వర్క్స్, ఇన్‌స్టాలేషన్, టెస్టింగ్, కమిషనింగ్‌తో పాటు 10 సంవత్సరాల పాటు ఆపరేషన్, మెయింటెనెన్స్ నిర్వహించాల్సి ఉంటుందన్నారు. పీఎం ఈ డ్రైవ్ పథకంలో భాగంగా అర్హులైన బిడ్డర్‌కు నిబంధనలకు లోబడి సబ్సిడీ కూడా ఇస్తున్నట్లు తెలిపారు. రెండు ప్రాజెక్టుల్లోనూ వినియోగదారుల కోసం ఈవీ ఛార్జింగ్ టారిఫ్‌ను యూనిట్‌కు రూ.13 (అదనం)గా నిర్ణయించామన్నారు. కాంట్రాక్ట్ కాలం మొత్తం ఇదే టారిఫ్ అమల్లో ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. రూ.169 ఛార్జింగ్ స్టేషన్ల ప్రాజెక్టుకు సెప్టెంబర్ 7న ఉదయం 11.30 గంటలకు, 200 ఛార్జింగ్ స్టేషన్ల ప్రాజెక్టుకు అదే రోజు ఉదయం 11 గంటలకు ప్రీ-బిడ్ సమావేశాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. బిడ్ల సమర్పణ ప్రక్రియ ఈనెల 08 నుంచి ప్రారంభమై 22న ముగుస్తుందని అన్నారు. టెండర్లను తెలంగాణ ఈ-ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ ద్వారా సమర్పించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.



## వర్షంతో చల్లబడిన అనకాపల్లి

**అనకాపల్లి జయ జయహే**

అనకాపల్లి పట్టణంలో ఆదివారం మధ్యాహ్నం ఆకస్మాత్తుగా భారీ వర్షం అరగంట సేపు వరకు పడడం జరిగింది గత కొన్ని నెలలుగా తీవ్రమైన ఎండలతో ప్రజలు నాన్న అవస్థలు గురవుతున్నారు ఒకపక్క వర్ష ఋతువు వచ్చిన వర్షాకాలం సమీపించిన రాష్ట్రంలో ఎక్కడ సరైన వర్షాలు లేక అటు ప్రజలు రైతులు అల్లల్లాడిపోతున్నారు ఎండలకు తట్టుకోలేక ప్రజలు ఏసిలు ఆన్ చేసుకునే గదిలో ఉండే పరిస్థితి ఏర్పడింది ఇటు రైతులు చూస్తే పంటలు వెయ్యాలా మానాల అనే సందిగ్ధంలో పడిపోయారు కొందరు రైతులు మోటార్ బోర్లు ఉన్నవాళ్లు ధైర్యం చేసి పంటలు వేయడం జరిగింది మరి కొందరు పంట కాలువలు ఆశ్రయించి పంటలు వేయడం జరిగింది మరికొందరు రైతులయితే చిరుధాన్యాలు కూరగాయలు పంటలు వేయడం జరిగింది అడపా దడప వర్షాలు అక్కడక్కడ ఆయా ప్రాంతాల్లో పడుతున్నాయి ఈ వర్షాలు కూడా ఒక ఏరియాలో పెడితే మరొక ఏరియాలో వర్షాలు పడటం లేదు ప్రజలు కూడా ఈ వర్షాలు చూసి ఆశ్చర్యపోవడం జరుగుతున్నది ఎక్కడ పూర్తిగా పెద్ద వర్షాలు అంటూ లేవు ఆదివారం మధ్యాహ్నం గట్టిగా భారీగా అరగంటసేపు వర్షం పడటంతో అనకాపల్లి పట్టణ మెయిన్ రోడ్లు విజయరామరాజుపేట అండర్ బ్రిడ్జి గవరపాలెం పార్క్ సెంటర్ లోతట్టు ప్రాంతాలు శారద నగర్ స్టేషన్ రోడ్ పలు ప్రాంతాలు వర్షపు నీరుతో జలమయం అయ్యాయి ఈ వర్షంతో వరి మడులకు అంతర పంటలకు ఈ వర్షం కొంతవరకు ఊపిరి అందినట్టు అయ్యింది అలాగే భూమిలో కూడా నీరు చేరి భూగర్భ జలాలు సమృద్ధి అయ్యే అవకాశం ఏర్పడుతుంది ఏది ఏమైనా వాతావరణం శాఖ వాళ్ళు ఈ మూడు రోజులు అల్పపీడనం ఉన్నట్లుగా చెప్పడం జరిగింది మరి ఈ వర్షాలు పడితే ఇటు రైతులకు అటు ప్రజలకు ఎంత మేలు చేకూరుతుంది ముఖ్యంగా రైతులు ఎంతో ఆనందిస్తారు




## పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకుడే మేలైన మార్గం

### ఐదు వేల మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

**చోడవరం, సెప్టెంబరు 6: జయ జయ హే**

పర్యావరణ పరిరక్షణ, ప్రజల్లో మట్టి వినాయకులపై అవగాహన కల్పించాలనే సంకల్పంతో సకురు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ఐదు వేల మట్టి వినాయక ప్రతిమలను భక్తులకు ఉచితంగా పంపిణీ చేశారు. చోడవరం ఎమ్మెల్యే కే.ఎస్.ఎన్.ఎస్.రాజు చేతుల మీదుగా ఈ కార్యక్రమం ప్రారంభమైంది.సకురు ఫౌండేషన్ వ్యవస్థాపకులు సకురు కోటేశ్వరరావు గత 15 సంవత్సరాలుగా మట్టి వినాయక ప్రతిమలను భక్తులకు పంపిణీ చేస్తూ పర్యావరణ పరిరక్షణకు తనవంతు కృషి చేస్తున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ సకురు కోటేశ్వరరావు చేపడుతున్న మట్టి వినాయకుల పంపిణీ కార్యక్రమాన్ని అభినందించారు. భవిష్యత్తులో యువ నాయకుడిగా ఎదిగి మరిన్ని సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు మేలు చేయాలని ఆకాంక్షించారు.మట్టి వినాయక ప్రతిమలను పూజించడం ద్వారా పర్యావరణ కాలుష్యాన్ని నియంత్రించవచ్చని ఎమ్మెల్యే తెలిపారు. ప్రతి ఒక్కరూ మట్టి వినాయకుడిని ప్రతిష్టించి భక్తిశ్రద్ధలతో పూజించాలని, తద్వారా పర్యావరణాన్ని కాపాడటంతో పాటు ప్రజల ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రతకు తోడ్పడాలని సూచించారు. సకురు కోటేశ్వరరావు మాట్లాడుతూ.. గత 15 సంవత్సరాలుగా మట్టి వినాయకుల పంపిణీ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



## వ్యవసాయ అధికారులతో ఎమ్మెల్యే బండారు సమీక్ష

**మాడుగుల సెప్టెంబర్ 6 జయ జయహే**

వెన్నెలపాలెం ఎమ్మెల్యే బండారు క్యాంపు కార్యాలయం లో ఆదివారం చోడవరం, నర్సీపట్నం వ్యవసాయ శాఖ ఏడీలు ,నియోజకవర్గంలో ఉన్న నాలుగు మండలాల వ్యవసాయ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా వర్ష ప్రభావితం ఏ విధంగా ఉందో ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు.ఈ సంవత్సరం వరి పంట అన్ని ఎకరాలు వేశారు ప్రస్తుత పరిస్థితి ఏంటి అన్న విషయాలపై చర్చించారు.ఈ సంవత్సరం ఎలీనోనో వల్ల వర్షాలు పడకపోవడం వల్ల దానికి ప్రత్యమయ పంటలు ఏమీ వేయాలి అన్నది రైతులకు తెలియజేయలన్నారు.

# నిడదవోలులో ఎల్టీటీ ఎక్స్‌ప్రెస్ హాల్ట్ పునరుద్ధరణ

## నిడదవోలు ప్రజల చిరకాల కోరిక సాకారం





**నిడదవోలు జయ జయహే ప్రతినిధి :**

నిడదవోలు రైల్వే జంక్షన్‌లో విశాఖపట్నం--ముంబై లోకమాన్య తిలక్ టెర్మినస్ (ఎల్టీటీ) ఎక్స్‌ప్రెస్ (18519/18520) రైలు నిలుపుదలను ఆదివారం పునరుద్ధరించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి రైల్వే అధికారులతో కలిసి జెండా ఊపి రైలు రాకపోకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ నిడదవోలు ప్రజల చిరకాల కోరిక నెరవేరిందని, హాల్ట్ పునరుద్ధరణకు కృషి చేసిన ఎంపీ పురందేశ్వరికి ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర, రాష్ట్రాల్లో కూటమి ప్రభుత్వం ఉండటంతో అభివృద్ధి వేగంగా సాగుతోందన్నారు. జన్మభూమి ఎక్స్‌ప్రెస్ సహా మరిన్ని ముఖ్యమైన రైళ్లకు నిడదవోలులో హాల్ట్ కల్పించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు. నిడదవోలు రైళ్ల నిలుపుదల అంశాన్ని కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ దృష్టికి తీసుకెళ్లగా ఎల్టీటీ ఎక్స్‌ప్రెస్ హాల్ట్‌కు ఆమోదం లభించిందన్నారు. జన్మభూమి ఎక్స్‌ప్రెస్ హాల్ట్‌ను కూడా పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎల్టీటీ ఎక్స్‌ప్రెస్ హాల్ట్‌తో ముంబైకి వెళ్లే వ్యాపారులు, ఉద్యోగులు, విద్యార్థులు, ప్రయాణికులకు ఎంతో ప్రయోజనం కలగనుంది. ఈ కార్యక్రమంలో రైల్వే అధికారులు, నిడదవోలు ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## ఓవర్ బ్రిడ్జికు డా యల్లప్రగడ నామకరణం చేయాలని ఎమ్మెల్యే కు వినతి

**భీమవరం ( జయ జయహే)**

వైద్య రంగంలో అద్భుతాల సృష్టికర్త యల్లాప్రగడ సుబ్బారావు అని, వైద్య రంగంలో ఆయన చేసిన సేవలు ఎనలేనివి అమూల్యమైనవని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం ఓవర్ బ్రిడ్జి (ఫ్లైవర్) కు వైద్య రంగ పితామహుడు డా యల్లప్రగడ సుబ్బారావు నామకరణం చేయాలని ఆదివారం ఎమ్మెల్యే కార్యాలయంలో యల్లప్రగడ సుబ్బారావు జయమతోత్సవ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే అంజిబాబు కు వినతిపత్రాన్ని అందించారు. కమిటీ కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ డా యల్లాప్రగడ పరిశోధనలు ప్రపంచ వ్యాప్తంగా కోట్ల మంది ప్రాణాలను కాపాడాయని, క్యాన్సర్ కణాల పెరుగుదలను అడ్డుకునే 'మెథోట్రెక్సేట్' అనే కీమోథెరపీ మందును ఆయనే కనుగొన్నారని, నేటికీ బ్లడ్ క్యాన్సర్ ఇతర క్యాన్సర్ల చికిత్సలో దీనిని వాడుతున్నారని అన్నారు. అటువంటి మహోన్నతి వ్యక్తి పేరును భీమవరం ఓవర్ బ్రిడ్జికు పెట్టాలని కోరుతున్నామని, భావితరాలకు మహోన్నత చరిత్ర తెలియజేస్తున్నట్లేనని అన్నారు. దీనిపై ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ మహోన్నత వ్యక్తుల చరిత్ర భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని, భీమవరం ఓవర్ బ్రిడ్జికు డా యల్లప్రగడ నామకరణం చేయడానికి కృషి చేస్తానని అన్నారు. కమిటి సభ్యులు అరసవల్లి సుబ్రమణ్యం, భట్టిప్రోలు శ్రీనివాసరావు, కలిగొట్ల గోపాలశర్మ, డా ఎస్ సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.




## డిజైర్ సొసైటీ ప్రత్యేక బాలలకు నిత్యావసరాలు పంపిణీ

**గాజువాక (జయ జయహే)**

అమ్మ సేవా సంకల్ప్ ట్రస్టు చైర్మన్ బొత్స దిలీప్ కుమార్ సౌజన్యంతో డిజైర్ సొసైటీ ప్రత్యేక పిల్లలకు ఏడు వేల రూపాయల విలువైన బియ్యం నూనె పప్పు దినుసులు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా బిజేపి గాజువాక ఇంచార్జ్ కరణంరెడ్డి నరసింగరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేఎన్ఆర్ మాట్లాడుతూ బిజేపి గాజువాక అసెంబ్లీ నియోజకవర్గం సోషల్ మీడియా కన్వీనర్ మరియు అమ్మ సేవా సంకల్ప్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బొత్స దిలీప్ కుమార్ జన్మదినం సందర్భంగా ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బిజేపి నాయకులు పేర్ల అప్పారావు, కృష్ణారెడ్డి, డిజైర్ సొసైటీ మేనేజర్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## వినాయక మండపాలకు ఆన్‌లైన్ అనుమతులు తప్పనిసరి..

**కొయ్యూరు సీఐ శ్రీనివాసరావు**

**కొయ్యూరు : (జయ జయహే న్యూస్) సెప్టెంబర్ 07,**

వినాయక చవితి పండుగ సందర్భంగా వినాయక మండపాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో అనుమతులు తీసుకోవాలని కొయ్యూరు సీఐ గారు తెలిపారు. రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు మండపాల అనుమతుల కోసం ప్తుఖఅవంష్టభ్యిఖ.అవ్ అనే ప్రత్యేక వెబ్‌సైట్‌ను పోలీస్ శాఖ అందుబాటులోకి తెచ్చిందని ఆయన పేర్కొన్నారు. ఈ విధానం పూర్తిగా ఉచితం, సింగిల్ విండో విధానంలో అనుమతులు జారీ చేస్తారని తెలిపారు. http://ganeshutsav.net వెబ్‌సైట్‌లోకి వెళ్లి మొబైల్ నంబర్ తో లాగిన్ అయి, మండపం ప్రదేశం, విగ్రహం ఎత్తు, కమిటీ సభ్యుల వివరాలు, నిమజ్జన తేదీ, సమయం వంటి వివరాలు నమోదు చేయాలి. దరఖాస్తు తర్వాత పోలీసులు, రెవెన్యూ, విద్యుత్ శాఖ అధికారులు పరిశీలించి క్యూఆర్ కోడ్ తో కూడిన అనుమతి పత్రం జారీ చేస్తారు. దాన్ని ప్రింట్ తీసి మండపంలో తప్పనిసరిగా ఉంచాలన్నారు. పోలీస్ అనుమతి లేకుండా మండపం ఏర్పాటు చేయకూడదు అని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. డీజేలు, అధిక శబ్దం వచ్చే సౌండ్ సిస్టంలు వాడకూడదన్నారు, రాత్రి 10 గంటల తర్వాత మైకులు వాడరాదని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 100 కు సమాచారం ఇవ్వాలని సీఐ సూచించారు.



## దుర్గంధ భరితంగా తయారైన శారదా నది

**అనకాపల్లి జయ జయహే**

అనకాపల్లి పట్టణ నడిబొడ్డిలో గల శారదా నది ఒకప్పుడు ఎంతో ఆహ్లాదకరంగా చల్లని గాలులు వీస్తూ మనసు ఎంతో హాయిగా ఉండేది ఆ పక్క నుంచి వెళ్లే వారికి కానీ ఈనాడు ఆ నది గర్భం ప్లాస్టిక్ వ్యర్థాలతో వివిధ రకాల చెత్త చదారాలతో జంతువుల కళేబరాలతో దుర్గంధ భరితంగా తయారయింది నిత్యం చుట్టుపక్కల ప్రజలు శారదా నది బ్రిడ్జి పై నుండి వారి ఇళ్లల్లో ఉన్న వ్యర్థాలను తెచ్చి ఆ నదిలో పారబోయడం జరుగుతుంది ఇలాగే ఎవరికి తోచిన విధంగా వారు తలో పిడికెడుగా అన్నట్టుగా మన ఇల్లలో జరిగే శుభకార్యాలు దైవ కార్యక్రమాలు సంబంధించిన వ్యర్థాలను తెచ్చి నదిలో కొందరు వేస్తే మరి కొందరు పాత గుడ్డలు చిరిగిపోయిన గుడ్డ ముక్కలు కూడా నదిలో పడవేయడం జరుగుతున్నది. మరికొందరు నది ప్రాంతం ఒడ్డున కూడా బళ్ళు పై చెత్తను తెచ్చి పారబోయడం జరుగుతుంది నదీ ప్రాంతం వద్ద గస్తీ లేకపోవడం దానికి తోడు మున్సిపాలిటీ సిబ్బంది కూడా పట్టించుకోకపోవడం నదుల వ్యర్థాలు తొలగించకపోవడం తో నది పూర్తిగా కలుషితం అయిపోయి ఉన్నది ఇదే వాటరు పట్టణంలో మంచినీరుగా సప్లై అవుతుంది స్థానిక ప్రజలు వాటర్ తాగలేక నానా అవస్థలు పడుతున్నారు దీంతో పట్టణ ప్రజలందరూ మున్సిపాలిటీ వాటర్ ను మంచినీళ్లకు వాడుక చేయకుండా మున్సిపాలిటీ వాటర్ ను బట్టలు వాషింగ్ కి, స్టీల్ సామాన్లు వాషింగ్ కి వాడుకోవడం ఇతర అవసరాలకు వాడడం జరుగుతున్నది ఒకపక్క పట్టణ ప్రజలు మంచినీరు బాగోల్లదిని మున్సిపాలిటీ వారికి ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసిన వారు పట్టించుకోవడం లేదు . దీంతో ప్రజలు చేసేదేమీ లేక వాటర్ను వాటన్ని వృధాగా మున్సిపాలిటీ కాలువ లోకి వదిలి వేస్తున్నారు మున్సిపాలిటీ వాటర్ దుర్గంధ వాసన వస్తుండడంతో పట్టణ ప్రజలు ఎవరు తాగటం లేదు ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు రాజకీయ నాయకులు నదీ జలాలపై శ్రద్ధ పెట్టాలని నది జలాలను పరిరక్షించాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు






## సర్వేంద్రియానం నైనం ప్రధానం

**పెదకూరపాడు,సెప్టెంబర్ 6 (జయ జయహే)**

సర్వేంద్రియానం నైనం ప్రధానం మని,నేత్రదానం చేసి అందులకు కంటి చూపు ఇవ్వొచ్చని మేరా యువ భారత్ గుంటూరు జిల్లా ఉపసంచాలకులు కిరణ్మయి దేవిరెడ్డి అన్నారు. పెదకూరపాడులోని జన చైతన్య సమితి స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో 41వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకొని జన చైతన్య సమితి ముద్రించిన కరపత్రాలను కిరణ్మయి ఆవిష్కరించి మాట్లాడుతూ కంటిచూపు లేని వారికి కంటి చూపు నివ్వడం గొప్ప సేవ అని అన్నారు. ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ సీఐ వి శ్రీనివాసులు మాట్లాడుతూ శరీరంలో ఏ అవయవ లోపం ఉన్న జీవితాన్ని నెట్టుకు రావచ్చేమో కానీ కళ్ళు లేకపోతే మాత్రం జీవితమంతా అంధకారమేనన్నారు. అందమైన ప్రపంచాన్ని చూడాలంటే కంటి చూపు తప్పనిసరి అని మరణం తర్వాత నేత్రదానం చేయవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో జనచైతన్య సమితి కోఆర్డినేటర్ వెలితోటి అనిల్ కుమార్, షేక్ లియాకత్ అలీ తదితరులు పాల్గొన్నారు.




## ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా నేల రోజుల పాటు సేవా సంకల్ప్ అభియాన్

**గాజువాక (జయ జయహే)**

కొత్త గాజువాక మండలం కార్యవర్గం సమావేశం మండల అధ్యక్షులు ఒమ్మి రంగనాయకులు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా రాష్ట్ర మీడియా పేనలిస్ట్ గాజువాక ఇంచార్జ్ కరణంరెడ్డి నరసింగరావు, ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కట్టా పద్మ పాల్గొన్నారు. మండలంలోని సమస్యలపై మరియు పార్టీ బలోపేతం వంటి పలు విషయాలు చర్చించారు. ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం పురస్కరించుకొని సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు సేవా సంకల్ప్ అభియాన్ పేరుతో దేశవ్యాప్తంగా జరుగుతున్న పలు సేవా కార్యక్రమాలను గాజువాక నియోజకవర్గం లో కూడా చేపడతామని తెలిపారు. రాష్ట్ర కమిటీలో గాజువాక వాస్తవ్యులు నరసింగరావుకి చోటు దక్కడం పట్ల అందరూ సంతోషం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మండల నాయకులు గూటూరు శంకరరావు , సూరిబాబు , నాగరాజు, విఠల్ పటేల్, గోపిరవిశంకర్, దుర్గా ప్రసాద్, వెంకటరమణ ,లలిత ,కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రమోషన్ల కోసం గంపెడాశలతో ఉద్యోగులు ఎదురుచూపులు..!

### అవి వచ్చేది - ఇచ్చేది ఎప్పుడు..?

**విశాఖపట్నం, సెప్టెంబర్ 6, జయ జయహే :**

విశాఖపట్నం రైల్వే డివిజన్‌లో ప్రమోషన్లపై స్పష్టత అవసరమనిసౌత్ కోస్ట్ రైల్వే ఓబీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ పెదిరెడ్ల రాజ శేఖర్ అన్నారు. ఈ మేరకు కొత్త జోన్ లో రైల్వే ఉద్యోగులు పడుతున్న బాధలను ఆదివారం విలేకరులకు తెలిపారు. 2026 జూన్ 1వ తేదీ నుంచి రైల్వే పరిపాలనా వ్యవస్థలో కీలక మార్పు చోటుచేసుకుందని. ఈస్ట్ కోస్ట్ రైల్వేలోని వాల్టేర్ డివిజన్ పునర్వ్యవస్థీకరణలో భాగంగా విశాఖపట్నం డివిజన్ నూతన సౌత్ కోస్ట్ రైల్వే జోన్ లో, రాయగడ డివిజన్ ఈస్ట్ కోస్ట్ రైల్వేలో కొత్తగా ఏర్పడ్డాయన్నారు. వేలాది మంది ఉద్యోగులు రెండు డివిజన్ లలో రెండు విభాగాలుగా విడిపోయారని, ఈ పునర్వ్యవస్థీకరణ అనంతరం ముఖ్యంగా సిబ్బంది సీనియారిటీ, క్యాడర్ విభజన, పోస్టుల కేటాయింపు మరియు ప్రమోషన్ల విషయంలో కొంత స్పష్టత లోపించడం వల్ల విశాఖపట్నం డివిజన్‌లో ప్రమోషన్ ప్రక్రియలో జాప్యం జరుగుతోందన్నారు. ఎన్నో సంవత్సరాలుగా ప్రమోషన్ కోసం ఎదురుచూస్తున్న ఉద్యోగుల్లో దీనివల్ల అనిశ్చితి నెలకొందని, ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని రైల్వే బోర్డు లేదా జోనల్ స్థాయిలో స్పష్టమైన మార్గదర్శకాలు త్వరితగతిన జారీ చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సీనియారిటీ, క్యాడర్ విభజన, ప్రమోషన్ అర్హతలు తదితర అంశాలపై స్పష్టమైన నిర్ణయం తీసుకుని, డివిజన్ స్థాయిలో పెండింగ్‌లో ఉన్న అన్ని ప్రమోషన్లు మరియు సంబంధిత నోటిఫికేషన్లను వీలైనంత త్వరగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రమోషన్ అనేది ఉద్యోగికి కేవలం హోదా పెరగడం మాత్రమే కాదని, అది అతని కృషికి లభించే గుర్తింపు, ఉత్సాహానికి మూలం, మరింత బాధ్యతగా పనిచేయడానికి ప్రేరణగా పేర్కొన్నారు. ఉద్యోగుల్లో ఉత్సాహం పెరిగితే వారి పనితీరు, నైపుణ్యం మరియు సామ-



ర్థ్యం మెరుగుపడి, తద్వారా రైల్వే సేవల నాణ్యత మరియు ఉత్పాదకత కూడా పెరుగుతుందన్నారు. విశాఖపట్నం డివిజన్‌లో సిబ్బంది ప్రమోషన్లకు సంబంధించిన అనేక అంశాలపై రైల్వే యాజమాన్యం త్వరితగతిన స్పష్టమైన నిర్ణయం తీసుకుని, ఉద్యోగుల న్యాయ-మైన ప్రమోషన్ అవకాశాలను పునరుద్ధరించాలని కోరారు. ఇది ఉద్యోగుల సంక్షేమంతో పాటు రైల్వే అభివృద్ధికి కూడా దోహదపడుతుందని, రైల్వే ఉద్యోగుల కుటుంబాలు కొత్త జోన్ వచ్చింది , కొత్త డివిజన్ ఏర్పడింది కాబట్టి ప్రమోషన్స్ వస్తాయని ఈ ప్రమోషన్ల కోసం ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారని అయితే రైల్వే అడ్మినిస్ట్రేషన్ ఈ ఉద్యోగుల ప్రమోషన్ల విషయముపై త్వరితగతిన చర్యలు తీసుకుని దశాబ్దాల పాటు ప్రమోషన్ల కోసం ఎదురుచూస్తున్న సిబ్బందికి నూతన ఉత్సాహాన్ని అందిస్తారన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.



# కొలెస్ట్రాల్ సమస్య

## ఒక్క స్పూన్ నూనెతో ఇలా వండేయండి..

## ఆరోగ్యంతో పాటు రుచి కూడా

నూనె మసాలాలతో కూడిన ఆహారాన్ని ఎంత ఎక్కువగా తీసుకుంటే కొలెస్ట్రాల్-మధుమేహం సమస్యలు అంతగా త్వరగా పెరుగుతాయి. వీలైనంత వరకు వేపుడు పదార్థాలకు దూరంగా ఉండటం మంచిది. ట్రైగ్లిజరైడ్స్ లేదా కొలెస్ట్రాల్, ఫ్యాటీ లివర్ సమస్యలు, ఊబకాయం ఉన్నవారు నూనె అస్సలు తినకూడదు. అలాగని.. ఒక్క చుక్క నూనెతో వంట చేయడం సాధ్యం కాదు. అయితే, వంటలో నూనె మొత్తాన్ని తగ్గించి వంట చేసుకోవచ్చు. అంటే 5 స్పూన్లకు బదులుగా 1 చెంచా ఉపయోగించవచ్చు. వంటల్లో నూనె వాడకాన్ని ఎలా తగ్గించాలో ఇక్కడ తెలుసుకుందాం..

నాన్ స్టిక్ పాన్ కొద్దిగా నూనెతో బాగా ఉడుకుతుంది. నాన్ స్టిక్ పాన్ లో కొద్దిగా నూనె రాస్తే త్వరగా ఉడికిపోతుంది. నూనె పాత్ర నుంచి నేరుగా పాన్ లోకి నూనె పోయవద్దు. ఒక చెంచా లేదా కొలిచే కప్పు ఉపయోగించాలి. నూనె పేస్ట్ కూడా ఉపయోగించవచ్చు.

వేయించిన ఆహారాన్ని ఎంత తక్కువ తింటే అంత ఎక్కువగా నూనె శరీరంలోకి చేరుతుంది. బదులుగా కాల్చిన ఆహారాలు తినడానికి ప్రయత్నించండి. నూనె పూసిన చేపలు, మాంసాన్ని కాల్చిన తర్వాత ఆహారంగా తీసుకోవచ్చు.మంటపై కాల్చకపోయినా, ఆవిరిపై కూడా వండుకోవచ్చు. ఇందుకు తక్కువ నూనె సరిపోతుంది. సుగంధ ద్రవ్యాలతో చేపలు, మాంసం, గుడ్లు ఆవిరి మీద ఉడికించి రుచిగా తినవచ్చు. పాన్‌లో ఆయిల్ వేసి విడిగా ఉడికించాల్సిన అవసరం లేదు. చేపలు, మాంసం లేదా ఇతర కూరగాయలను పులుసు మాదిరి కలిపి సన్నని మంటపై ఉడికించినా సరిపోతుంది. అన్నంలో రుచిగా ఉంటుంది.

## వర్కౌట్స్ రెగ్యులర్‌గా చేస్తే

# మెరిసే స్కిన్ మీ సొంతం

**స్కిన్ మెరవడానికి చాలా మంది చాలా ట్రై చేస్తుంటారు. అయితే, హెల్దీ లైఫ్‌స్టైల్ కారణంగానే స్కిన్ అందంగా మెరుస్తుంది. దీంతోపాటు స్కిన్ రొటీన్ ఫాలో అవ్వాలి. దీంతో పాటు కొన్ని ఎక్సర్‌సైజెస్ కూడా హెల్ప్ చేస్తాయి. అవేంటో తెలుసుకోండి. ఎక్సర్‌సైజెస్ ఆరోగ్యానికి ఎంత మంచివో.. శరీరానికి కూడా అంతే మంచివి. ఎక్సర్‌సైజ్ చేయడం వల్ల చెమట వస్తుంది. దీంతో స్కిన్ క్లియర్ అవుతుంది. స్కిన్ మెరుస్తుంది కూడా. మరి ఏ ఎక్సర్‌సైజెస్ చేస్తే స్కిన్‌కి మంచిది. స్కిన్ అందంగా మెరుస్తుందో పూర్తి వివరాలు తెలుసుకోండి.**



### ఫేషియల్ యోగా..

ఫేషియల్ యోగా కూడా స్కిన్ గ్లోయింగ్‌కి హెల్ప్ చేస్తుంది. దీని వల్ల ఎలాంటి బొటాక్స్, సర్జరీ చేయకుండానే స్కిన్ లిఫ్ట్ అవుతుంది. దీని వల్ల ఫేషియల్ మజిల్స్ టోన్ అవుతాయి. దీనిని రెగ్యులర్‌గా చేస్తే స్కిన్ టోన్ అవుతుంది. ఫేషియల్ యోగాలో స్కిన్ గ్లో అవ్వడానికి ఫిష్ లిప్స్, కిస్ ఫేస్, విజిల్స్ వంటి ఫేషియల్ యోగా వర్కౌట్స్ చేయొచ్చు. దీని వల్ల స్కిన్ గ్లో అవుతుంది.

### వెయిట్ ట్రైనింగ్..

మీరు గనుక జిమ్‌లో అయినా, ఇంట్లో అయినా వెయిట్ ట్రైనింగ్ వర్కౌట్స్ చేస్తే అది మీ బాడీకి, స్కిన్‌కి చాలా హెల్ప్ చేస్తాయి. ఏ వెయిట్ ట్రైనింగ్ అయినా మజిల్స్‌ని టోన్ చేస్తాయి. స్కిన్ అందంగా మెరుస్తుంది. దీని వల్ల మజిల్స్ టైట్ అవుతాయి. స్కిన్ యంగ్‌గా కనిపించేలా చేస్తుంది. దీనికోసం వారంలో రెండు, సార్లు వెయిట్ ట్రైనింగ్ వర్కౌట్స్ చేయొచ్చు.



### ఏరోబిక్స్..

స్కిన్ కోసం కేవలం హై ఇంటెన్సిటీ వర్కౌట్స్ మాత్రమే చేయాల్సిన అవసరం లేదు. ఏరోబిక్స్ కూడా హెల్ప్ చేస్తాయి. ఏరోబిక్స్ కారణంగా స్కిన్ క్లియర్ అవుతుంది. కొల్లాజెన్ ప్రొడక్షన్ పెరుగుతుంది. కొల్లాజెన్ కారణంగా చర్మంలో సాగే గుణం పెరుగుతుంది. దీని వల్ల ముడతలు తగ్గుతాయి. స్కిన్ అందంగా కనిపిస్తుంది.

### స్విమ్మింగ్..

స్విమ్మింగ్ పూల్‌లో క్లోరైన్ ఉంటుంది. ఇది ఒక్కొక్కరి స్కిన్‌పై ఒక్కో ఎఫెక్ట్‌ని చూపిస్తుంది. క్లోరైన్‌లో కొన్ని యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉన్నాయి. అవి బ్రేక్ అవుట్స్ కాకుండా హెల్ప్ చేస్తాయి. కేవలం స్కిన్‌కి మాత్రమే కాదు. బరువు తగ్గడానికి కూడా హెల్ప్ అవుతుంది. దీంతో పాటు స్కిన్ టోన్ కూడా ఇంప్రూవ్ అవుతుంది.

### రన్నింగ్..

రన్నింగ్ చేయడం వల్ల చెమట ఎక్కువగా వస్తుంది. దీంతో స్కిన్ పోర్స్ ఓపెన్ అవుతాయి. దీని వల్ల దుమ్ము, ఆయిల్ అన్నీ కూడా బయటికి వస్తాయి. దీని వల్ల స్కిన్‌కి మంచి లుక్ వస్తుంది. రన్నింగ్ చేయడానికి మీరు జిమ్‌కి వెళ్ళడం, ట్రెడ్‌మిల్ కూడా వాడాల్సిన అవసరం లేదు. మీరు ఖాళీ ప్లేస్‌లో రన్నింగ్ చేయొచ్చు. దీని వల్ల బ్లడ్ పంప్ అవుతుంది. దీంతో స్కిన్ పోర్స్ ఓపెన్ అవుతాయి. అయితే, బయట రన్ చేసేటప్పుడు సన్‌స్క్రీన్ రాసుకోవడం మర్చిపోవద్దు.

### వీటితో పాటు..

కాస్లీసీరమ్, స్క్రబ్స్ బదులు నేచురల్ స్కిన్‌కేర్ చాలా మంచిది. బ్యాలెన్స్, హెల్దీ లైఫ్‌స్టైల్ ఫాలో అవ్వడం వల్ల స్కిన్ హెల్దీగా కనిపిస్తుంది. ఎక్సర్‌సైజ్ చేయడం వల్ల కూడా స్కిన్ నేచురల్‌గా గ్లో అవుతుంది. జిమ్ చేయడం, వర్కౌట్స్ చేసేటప్పుడు డియోడ్రెంట్ వంటి ప్రోడక్ట్స్‌ని మర్చిపోవద్దు.

# నోట్లో వేసుకుంటే కరిగిపోయే పైన్ నట్స్



## ఎన్నో వ్యాధులకు దివ్యౌషధం

అనేక పోషకాలున్న పైన్ నట్స్ ధర మాత్రం చాలా ఎక్కువ. కిలోకు దాదాపుగా 8000 రూపాయల దాకా ఉంటుంది. అంటే ఓ గ్రాము బంగారంతో సమానం. పైన్ గింజలు తినడానికి చాలా రుచికరమైనవి. పోషకమైనవి. ఇది మనల్ని అనేక వ్యాధుల నుండి రక్షించే దివ్యౌషధం.

మనకు అందుబాటులో ఉన్న అనేక డ్రైఫ్రూట్స్‌లలో రుచికరమైనవి అంటే..జీడిపప్పు, బాదాం, పిస్తాలే కాదు.. అంతకుమించిన మధురమైన రుచి ఈ పైన్ నట్స్‌కు ఉంటుంది. తినడానికి క్రీమీగా, నోట్లో వేసుకుంటే కరిగిపోతాయి. ఏదో మంచి స్వీట్ తిన్న అనుభూతి వస్తుంది.

పైన్‌నట్స్‌లో అధిక శాతం అసంతృప్త కొవ్వు ఉంటుంది. ఇది గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ఇందులో విటమిన్ ఇ, ఫైబర్, ప్రోటీన్, మెగ్నీషియం, కాల్షియం, ఫాస్పరస్ వంటి అనేక ఇతర పోషకాలు పైన్ గింజలలో ఉన్నాయి. పైన్ గింజలలో కాల్షియం పుష్కలంగా లభిస్తుంది. ఇది ఎముకలు దృఢంగా ఉంచుతుంది.

వీటిని తినడం వల్ల కొవ్వులున్న జంక్ ఫుడ్ తినాలనే కోరిక తగ్గుతుంది. బరువు తగ్గాలని ప్రయత్నించేవారు చిల్గోజా తినడం అలవాటు చేసుకోవాలి. అనారోగ్యకర ఆహారాలు తినాలనే కోరిక తగ్గించడంతో పాటూ బరువు తగ్గడంలోనూ ఇది సాయపడుతుంది. అంతేకాదు..చిల్గోజాలో ఒమేగా 6, సెలీనియం ఉంటాయి. ఇవి క్యాన్సర్ కణాలు పెరగకుండా నిరోధిస్తుంది. క్యాన్సర్ రాకుండా కాపాడుతుంది.

చిల్గోజాలో జింక్ పుష్కలంగా ఉంటుంది. ఇది సంతానలేమి వంటి సమస్యను తొలగించడానికి సహాయపడుతుంది. చిల్గోజా సాధారణ జలుబు నుండి రక్షించడానికి కూడా సహాయపడుతుంది. జింక్ పరిమాణం గాయం వేగంగా నయం చేయడానికి సహాయపడుతుంది.

పైన్ గింజల గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువవ్వడం వల్ల డయాబెటిస్ లో కూడా ప్రయోజనకరంగా ఉంటుంది. దీనివల్ల ఇన్సులిన్ పనితీరు పెరుగుతుంది. చిల్గోజా తినడం వల్ల డయాబెటిస్ ప్రమాదాన్ని కూడా తగ్గిస్తుంది. డిప్రెషన్, చిరాకు, మూడ్ స్వింగ్స్ వంటి సమస్యలు ఉన్నవారు ఆహారంలో చిల్గోజా చేర్చుకోవాలి. మెగ్నీషియం మోతాదు ఈ సమస్యల నుండి ఉపశమనం కలిగిస్తుంది. అలాగే రాత్రిపూట చిల్గోజా తింటే కండరాలు రిలాక్స్ అవుతాయి.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com